11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 45 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 22 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :45 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 22 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది

- శాంతిభద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ
- గూగుల్ రాకకు అదే కారణమన్న సీఎం చంద్రబాబు
- రాజకీయ ముసుగులో పెరిగిపోతున్న నేరాలు, విద్వేషాలు
- పోలీసుల కుటుంబ సంక్షేమం ప్రభుత్వ బాధ్యత
- సోషల్ మీడియా నేరాలు పోలీసులకు పెను సవాలు
- మంగళగిరిలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయన్న నమ్మకంతోనే గూగుల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబ దులకు రక్షణ ఉంటేనే పారిశ్రామికవేత్తలు వస్తారని, తద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు.

**గూగుల్ రాకకు అదే కారణం**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి పూర్తి భద్రత ఉంటుందన్న భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి అన్నారు. "శాంతిభద్రతలు అనే పునాదిపైనే అభివృద్ధి, సంక్షేమం ఆధారపడి ఉంటాయి. సమాజంలో అశాంతి, అలజడి ఉంటే ఏ ఒక్క పరిశ్రమా రాష్ట్రం వైపు చూడదు. అందుకే శాంతిభద్రతల విషయంలో నేను ఎప్పుడూ కఠినంగా ఉంటాను. ఆ నమ్మకంతోనే విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేస్తోంది. ఇది దేశంలోనే అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి. ఇలాంటివి మరిన్ని రావాలంటే పోలీస్ వ్యవస్థ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి" అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణిచివేయడంలో ఏపీ పోలీసులది ప్రత్యేక గుర్తింపు అని ప్రశంసించారు.

**పోలీసులది ఉద్యోగం కాదు.. నిస్వార్థ సేవ**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. "1959 అక్టోబర్ 21న లధఖ్‌లో చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి 10 మంది జవాన్లు ప్రాణత్యాగం చేశారు. వారి స్ఫూర్తితోనే ఏటా ఈ రోజును పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకుంటున్నాం. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 192 మంది

వివరాలు 2లో..

## భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్..?

### నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం



- భీమవరం డీఎస్పీ జయసూర్యపై పవన్‌కు ఫిర్యాదులు
- పేకాట శిబిరాలు, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు
- పశ్చిమ గోదావరి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన పవన్ కల్యాణ్

పెన్ పవర్ డెస్క్:పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారశైలిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. డీఎస్పీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని

వివరాలు 2లో..

## ఏపీకి గూగుల్ రాకపై తమిళనాట రాజకీయ రగడ...

### ఒక్క మాటతో తేల్చేసిన నారా లోకేశ్



- విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్
- తమిళనాడు డీఎంకేపై అన్నాడీఎంకే విమర్శలు
- డీఎంకే ప్రభుత్వ వైఫల్యం వల్లే పెట్టుబడి ఏపీకి వెళ్లిందన్న అన్నాడీఎంకే
- గూగుల్ సీఈవో తమిళ వ్యక్తి అయినా పెట్టుబడి తేలేకపోయారని విమర్శ
- ఈ రాజకీయ వివాదంపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేశ్‌ఓ

పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వ్యవహారం పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ దుమారం రేపుతోంది. ఈ పరిణామంపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికరంగా స్పందించారు. తమిళనాడులోని అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే మధ్య జరుగుతున్న మాటల యుద్ధానికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను ఆయన పంచుకున్నారు.విశాఖకు గూగుల్ రూపంలో

వివరాలు 2లో..

## 6 వేల పోలీసు ఉద్యోగాలకు త్వరలో పోస్టింగ్‌లు



- పోలీసు నియామకాలపై మంత్రి అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు
- 6 వేల ఉద్యోగాలకు త్వరలోనే పోస్టింగ్స్ ఇస్తామని వెల్లడి
- గత ఐదేళ్లలో ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదని విమర్శ
- రాష్ట్రంలో పోలీస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్న మంత్రి
- సమస్యలున్నా ఉద్యోగులందరికీ డీఏ ఇచ్చామని వ్యాఖ్య

వివరాలు 2లో..

## నేటి నుంచి యూఏఈలో సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట...

- నేటి నుంచి మూడు రోజుల పాటు సీఎం చంద్రబాబు యూఏఈ పర్యటన
- రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- పలు అంతర్జాతీయ సంస్థల అధినేతలతో చంద్రబాబు భేటీ
- సీఐఐ రోడ్ షో, ప్రవాసాంధ్రుల సమావేశంలో పాల్గొననున్న సీఎం
- సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల బృందం పర్యటన

వివరాలు 2లో..



## ప్రొద్దుటూరును క్యాసినో అడ్డాగా మార్చారు

## రాచమల్లు సంచలన ఆరోపణలు

- ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయన్న రాచమల్లు
- క్యాసినో, మట్కా, బెట్టింగ్ విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆరోపణ
- టీడీపీ నేతలే ఈ దందాలు నడుపుతున్నారన్న రాచమల్లు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం అసాంఘిక కార్యకలాపాలకు కేం ద్రంగా మారిందని, అధికార టీడీపీ నాయ కులే ఈ వ్యవహారాలను నడిపిస్తున్నారని వైసీపీ



## రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సింధూర్'..

### దీపావళి లేఖలో ప్రధాని మోదీ

- దేశ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ లేఖ
- రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సింధూర్' చేపట్టామన్న ప్రధాని
- జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు వేల కోట్ల ఆదా అని వెల్లడి
- స్వదేశీ వస్తువులనే వాడాలంటూ ప్రజలకు పిలుపు
- త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందన్న మోదీ

వివరాలు 2లో..



## పోలీసుల వల్లే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు



- పోలీసు అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న అనిత
- పోలీసు శాఖలో 6,100 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టామని వెల్లడి
- మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:పోలీసు శాఖను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టామని ఆమె స్పష్టం చేశారు. ఈరోజు మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహించిన 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే అందుకు పోలీసుల త్యాగాలే కారణమని కొనియాడారు.

వివరాలు 2లో..

## తాడిపత్రి ఏఎస్పీపై జేసీ ఫైర్.. యూపీకి తిప్పి పంపిస్తానంటూ తీవ్ర వ్యాఖ్యలు

- తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్‌పై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఏఎస్పీకి చదువు తప్ప బుద్ధి, జ్ఞానం లేవని వివాదాస్పద వ్యాఖ్య
- ఘర్షణలు జరిగితే ఏఎస్పీ భయపడి పారిపోతారని ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:స్థానిక ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏఎస్పీకి చదువు మాత్రమే ఉందని, బుద్ధి, జ్ఞానం ఏమాత్రం లేవని సంచలన వ్యాఖ్యలు చేశారు. పదివేల మందితో సంతకాలు సేకరించి ఆయన్ను తిరిగి ఉత్తరప్రదేశ్‌కు పంపించేస్తామని హెచ్చరించారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారికి నివాళులర్పించిన అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఏఎస్పీ రోహిత్ కుమార్ తీరుపై

వివరాలు 2లో..



## ఆస్ట్రేలియా పర్యటనలో నారా లోకేశ్ చొరవ...

### ఏపీ ఆక్వా రైతులకు భారీ ఊరట



- భారత రొయ్యల దిగుమతికి ఆమోదం తెలిపిన ఆస్ట్రేలియా
- ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- వైట్ స్పాట్ వైరస్ కారణంగా ఉన్న అడ్డంకులు ఇక దూరం
- అమెరికా సుంకాలతో నష్టపోయిన ఆక్వా రంగానికి గొప్ప ఊరట
- కొత్త మార్కెట్ల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలం
- సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియాతో భాగస్వామ్యంపై లోకేశ్ చర్చలు ఫలప్రదం

పెన్ పవర్ డెస్క్:అమెరికా విధించిన భారీ సుంకాలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు భారీ ఊరట లభించింది. భారత రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. చాలాకాలంగా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్‌ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం విశాఖలో స్థల పరిశీలన జరుగుతోంది. గూగుల్ సంస్థ ప్రతినిధులు విశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు.గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు. త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి 2028-32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. దీనితో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు రావటం కష్టమంటున్నారు. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

# పోలీసుల వల్లే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు

- మొదటి పేజి తరువాయి

విధి నిర్వహణలో వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని, నేరాల నియంత్రణలో ఏపీ పోలీసులు దేశంలోనే ముందున్నారని ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనిత ఉద్ఘాటించారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్ టీం'ను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించామని చెప్పారు. నిఘాను మరింత పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

# భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్..?

## నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం

- మొదటి పేజి తరువాయి

జిల్లా ఎస్పీని ఆయన ఆదేశించారు.

భీమవరం డీఎస్పీ పరిధిలో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, ఆయన నేరుగా సివిల్ వివాదాల్లో తలదూరుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి పలు ఫిర్యాదులు అందాయి. కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి నేతల పేర్లను వాడుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పవన్ కల్యాణ్ నేరుగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు.తన దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ, డీఎస్పీ జయసూర్య పనితీరుపై నివేదిక పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు సివిల్ వివాదాల జోలికి వెళ్లకుండా చూడాలని, ఇలాంటి చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూస్తూ శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు.అంతేకాకుండా, భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణల విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, డీజీపీ దృష్టికి కూడా తీసుకెళ్లాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

# తాడిపత్రి ఏఎస్పీపై జేసీ ఫైర్.. యూపీకి తిప్పి పంపిస్తానంటూ తీవ్ర వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆయన ఎప్పుడూ పోలీస్ డ్రెస్సులో కనిపించలేదు. ఆయనకు చదువు తప్ప బుద్ధి, జ్ఞానం, తెలివి లేవు. ఈ ఉద్యోగానికి ఆయన అనర్హుడు" అని జేసీ విమర్శించారు. తాను కార్యాలయం ముందు నిరసన తెలిపితే, ఏఎస్పీ బయటకు రాకుండా ఇంట్లోనే దాక్కున్నారని ఎద్దేవా చేశారు. తాడిపత్రిలో ఎక్కడైనా రాళ్ల దాడి జరిగితే ఈ ఏఎస్పీ భయపడి పారిపోతారని ఆరోపించారు.ఏఎస్పీ రోహిత్ కుమార్ తాడిపత్రికి వచ్చిన తర్వాత కూడా నేరాల సంఖ్య ఏమాత్రం తగ్గలేదని, టీడీపీ అధికారంలోకి వచ్చాకే క్రైమ్ రేట్ తగ్గిందని జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లో ఉన్న వ్యక్తిని ఇక్కడికి తీసుకొచ్చారంటూ ఆయన వ్యవహారశైలిపై అసహనం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్ వాళ్లకు బుద్ధి, జ్ఞానం ఉండవంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. కిందిస్థాయి సిబ్బంది అయిన కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలను చూసి ఏఎస్పీ చాలా విషయాలు నేర్చుకోవాలని జేసీ హితవు పలికారు. గత ఐదేళ్ల పాలనలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల వల్ల పోలీస్ వ్యవస్థ మొత్తం భ్రష్టు పట్టిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# 6 వేల పోలీసు ఉద్యోగాలకు త్వరలో పోస్టింగ్‌లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భర్తీ చేసిన 6 వేల పోలీసు ఉద్యోగాలకు త్వర లోనే పోస్టింగులు ఇవ్వనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. పోలీ సు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈరోజు నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన పాల్గొని, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు నియామకాల ఆవశ్యకత ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు.గత ఐదేళ్ల పాలనలో పోలీసు శాఖలో నియామకాలు చేపట్టలేదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిందని, వీరికి త్వరలోనే నియామక పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో అనేక పోలీస్ స్టేషన్లు, క్వార్టర్ల పరిస్థితి బాగోలేదని మంత్రి అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. వాటి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని స్పష్టం చేశారు. పోలీసులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రభుత్వం

కట్టుబడి ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ డీఏ మంజూరు చేశామని గుర్తుచేశారు. అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడుతూ, వారి సేవలను స్మరించుకున్నారు.

# రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సిందూర్'..

దీపావళి పర్వదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక లేఖ విడుదల చేశారు. శ్రీరాముడు ధర్మాన్ని నిలబెట్టడం నేర్పినట్టే, అన్యాయంపై పోరాడే స్ఫూర్తిని కూడా ఇస్తారని ఆయన పేర్కొన్నారు. కొద్ది నెలల క్రితం జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఇందుకు ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని మోదీ వ్యాఖ్యానించారు.ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన గౌరవాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా జరిగిన అన్యాయానికి ప్రతీకారం కూడా తీర్చుకుందని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం ప్రారంభమయ్యాక ఇది రెండో దీపావళి అని ప్రధాని గుర్తుచేశారు.ఈ దీపావళి చాలా ప్రత్యేకమైనదని ప్రధాని అభివర్ణించారు. దేశంలోని మారుమూల జిల్లాలతో సహా అనేక ప్రాంతాల్లో తొలిసారిగా దీపాలు వెలుగుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు నక్సలిజం, మావోయిస్టు ఉగ్రవాదంతో అట్టుడికిన ఈ ప్రాంతాలు ఇప్పుడు పూర్తిగా ప్రశాంతంగా మారాయని అన్నారు. హింసా మార్గాన్ని వీడిన ఎందరో మన రాజ్యాంగంపై విశ్వాసంతో అభివృద్ధి ప్రవంతిలో కలుస్తున్నారని, ఇది దేశానికి గొప్ప విజయమని మోదీ పేర్కొన్నారు.ఇటీవల ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక సంస్కరణలను కూడా మోదీ ప్రస్తావించారు. నవరాత్రుల తొలి రోజు నుంచే తగ్గిన జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయని, 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' ద్వారా ప్రజలు వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. పలు సంక్షోభాలతో ప్రపంచం అస్థిరంగా ఉన్నప్పటికీ, భారత్ స్థిరత్వానికి చిహ్నంగా నిలిచిందన్నారు. సమీప భవిష్యత్తులోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించాలని మోదీ పిలుపునిచ్చారు. స్వదేశీ ఉత్పత్తులను స్వీకరించి, 'ఇది స్వదేశీ!' అని గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్' స్ఫూర్తిని పెంపొందించాలని,

అన్ని భాషలను గౌరవించాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించుకుని, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని హితవు పలికారు.ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినప్పుడు దాని కాంతి తగ్గదని, ఇంకా పెరుగుతుందని దీపావళి మనకు నేర్పుతుందని మోదీ అన్నారు. అదే స్ఫూర్తితో సమాజంలో సామరస్యం, సహకారం, సానుకూలత అనే దీపాలను వెలిగిద్దామని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# నేటి నుంచి యూఏఈలో సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట...

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించడమే అజెండాగా ఆయన బుధవారం నుంచి మూడు రోజుల పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చంద్రబాబుతో పాటు మంత్రులు, కీలక శాఖల ఉన్నతాధికారులతో కూడిన ఉన్నతస్థాయి బృందం కూడా పాల్గొంటుంది.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) వచ్చే నెల 14, 15 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించడం కూడా ఈ పర్యటనలో కీలక ఉద్దేశం. బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి చంద్రబాబు బృందం దుబాయ్‌కు బయల్దేరి వెళుతుంది. ఈ మూడు రోజుల్లో సీఎం పలువురు పారిశ్రామికవేత్తలు, యూఏఈ ప్రభుత్వ ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాల్లో పాల్గొంటారు. ఇప్పటికే ప్రభుత్వం సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో రోడ్ షోలు నిర్వహించి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే.

పర్యటనలో భాగంగా తొలిరోజైన అక్టోబర్ 22న చంద్రబాబు ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్, లూలూ గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ వంటి దిగ్గజ సంస్థల యాజమాన్యాలతో ఆయన చర్చలు జరుపుతారు. ముఖ్యంగా ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పోర్టులు, షిప్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. దీనితో పాటు దుబాయ్‌లో సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) నిర్వహించే రోడ్ షోలో కూడా సీఎం పాల్గొంటారు.పర్యటన చివరి రోజున ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా (ప్రవాసాంధ్రులు) సమావేశంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఏపీ ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రి రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

# పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది

- మొదటి పేజి తరువాయి

పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్న పోలీసులు చేసేది కేవలం ఉద్యోగం కాదు, అదొక నిస్వార్థ సేవ. వారి త్యాగాలను స్మరించుకుంటూ స్ఫూర్తి పొందాలి" అని అన్నారు.రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లు

సమాజంలో నేరాల స్వరూపం మారుతోందని, ముఖ్యంగా రాజకీయ ముసుగులో కొత్త తరహా నేరగాళ్లు పుట్టుకొస్తున్నారని చంద్రబాబు హెచ్చరించారు. "సమాజంలో అశాంతి సృష్టించి లబ్ధి పొందడమే లక్ష్యంగా కొందరు పనిచేస్తున్నారు. వీళ్లు సాధారణ నేరగాళ్ల కంటే ప్రమాదకరం. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ మరణం, జీడీ నెల్లూరులో అంబేద్కర్ విగ్రహ దహనం వంటి ఘటనల్లో వాస్తవాలను దాచిపెట్టి, మత ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నించారు. సీసీ కెమెరాల వల్ల నిజాలు బయటపడ్డాయి. కల్తీ మద్యం విషయంలోనూ ఇలాగే దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు," అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా సాగే వ్యక్తిత్వ హననం, అసత్య ప్రచారాలు పోలీసులకు పెను సవాలుగా మారాయని పేర్కొన్నారు.

**టెక్నాలజీతో నేరాల కట్టడి**

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖను సాంకేతికంగా బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. "నేరగాళ్లు అప్‌డేట్ అవుతుంటే, వారిని పట్టుకోవడానికి పోలీసులు మరింత అప్‌డేట్‌గా ఉండాలి. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 50 మీటర్లకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీసులకు మూడో కన్నులా పనిచేస్తుంది. డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్ వంటి టెక్నాలజీని వినియోగించి నేరాలను ఛేదిస్తున్నారు. అడవుల్లో గంజాయి తోటలను, ఎర్రచందనం స్మగ్లర్లను గుర్తించడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో ఏపీ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది" అని అభినందించారు.

**పోలీసు కుటుంబాలకు ప్రభుత్వ అండ**

పోలీసుల సంక్షేమానికి, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "పోలీసుల గౌరవం పెంచడంతో పాటు వారి కుటుంబ సంక్షేమ

బాధ్యత మాది. పోలీసుల వైద్య సేవల కోసం 16 నెలల్లో రూ.33 కోట్లు విడుదల చేశాం. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ.23 కోట్లు అందించాం. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు చేయాలని నిర్ణయించాం. పోలీసులకు ఒక సరెండర్ లీవ్‌ను రెండు విడతల్లో చెల్లిస్తాం. 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిచేశాం. శాఖాపరమైన పదోన్నతులు కూడా సకాలంలో అందిస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరును క్యాసినో అడ్డాగా మార్చారు

# రాచమల్లు సంచలన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టణంలో క్యాసినో, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి జూద క్రీడలు విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆయన విమర్శించారు.ఈ అక్రమ కార్యకలాపాలను టీడీపీకి చెందిన కీలక నాయకులే స్వయంగా నిర్వహిస్తున్నారని రాచమల్లు ఆరోపించారు. గోవాలో క్యాసినోలు నడిపే వారే ఇక్కడ కూడా ఈ దందాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో జూదం కోసం కడప నుంచి హైదరాబాద్ మీదుగా గోవాకు వెళ్లేందుకు ఇండిగో విమానంలో నిర్వాహకులు టికెట్లు కూడా బుక్ చేసుకున్నారని ఆయన సంచలన విషయాలు వెల్లడించారు. పట్టణంలో గంజాయి అమ్మకాలు పెరిగిపోయి యువత భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అక్రమాలతో పాటు, ప్రొద్దుటూరు కేంద్రంగా కొందరు టీడీపీ కౌన్సిలర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని, నకిలీ మద్యం కూడా విరివిగా విక్రయిస్తున్నారని రాచమల్లు ఆరోపించారు. "పేద ప్రజల రక్తాన్ని టీడీపీ నేతలు పీల్చేస్తున్నారు. ఈ అక్రమాలన్నీ పోలీసులకు తెలిసినా ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహిస్తున్నారు" అని ఆయన అన్నారు.యువత భవిష్యత్తును నాశనం చేసే ఈ కార్యకలాపాలను తక్షణమే ఆపాలని టీడీపీ నాయకులను డిమాండ్ చేశారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ అయినా ఈ అక్రమాలపై దృష్టి సారించి, వాటిని అరికడతారని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ప్రొద్దుటూరులో శాంతిభద్రతలను కాపాడాలని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కోరారు.

# ఏపీకి గూగుల్ రాకపై తమిళనాట రాజకీయ రగడ...

- మొదటి పేజి తరువాయి

భారీ పెట్టుబడి రావడంపై తమిళనాడులో తీవ్ర చర్చ జరుగుతోంది. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తమిళనాడులోని మధురైలో జన్మించారని, అలాంటి తమిళ మూలాలున్న వ్యక్తి నేతృత్వంలోని సంస్థ నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం విఫలమైందని అన్నాడీఎంకే తీవ్రంగా ఆరోపిస్తోంది. ఈ అంశాన్ని అస్త్రంగా చేసుకుని డీఎంకే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇరు పార్టీల మధ్య జరుగుతున్న ఈ రాజకీయ వాగ్వాదానికి సంబంధించిన వీడియోను నారా లోకేశ్ తన పోస్టులో పంచుకున్నారు.

ఈ సందర్భంగా లోకేశ్ తనదైన శైలిలో స్పందించారు. సుందర్ పిచాయ్ ఆంధ్రప్రదేశ్‌ను కాదు, పెట్టుబడుల కేంద్రంగా భారత్‌ను ఎంచుకున్నారని ఒక్క మాటలో తేల్చేశారు. "%ఎజు జనూూజు దీనూ=ూు%" (ఆయన భారత్‌ను ఎంచుకున్నారు) అంటూ తన పోస్టుకు వ్యాఖ్యను జోడించారు. ఈ ట్వీట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఎందుకు మీకీ కొట్లాట... ఆయన డేటా సెంటర్ పెడుతోంది భారత్ లోనేగా అని అర్థం వచ్చేలా... లోకేశ్ పేర్కొన్నారు. ఈ పెట్టుబడిని కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం చేయకుండా, దేశ విజయంగా చూడాలన్న సందేశాన్ని లోకేశ్ తన పోస్ట్ ద్వారా తెలియజేశారు.ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒప్పందం ప్రకారం, గూగుల్ సంస్థ విశాఖపట్నంలో తన డేటా సెంటర్, ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. రాబోయే ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 1.33 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖ నగరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా మారుతుందని ఏపీ ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఆస్ట్రేలియా పర్యటనలో నారా లోకేశ్ చొరవ...

- మొదటి పేజి తరువాయి

వైట్ స్పాట్ వైరస్ కారణంగా మన రొయ్యలపై ఉన్న అడ్డంకులు ఈ నిర్ణయంతో తొలగిపోయాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శుభవార్తను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.ఈ పరిణామంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "భారత రొయ్యల దిగుమతికి తొలిసారిగా ఆమోదం లభించింది. ఇందుకు విశేషంగా కృషి చేసిన భారత, ఆస్ట్రేలియా ప్రభుత్వాలకు మా ప్రగాఢ కృతజ్ఞతలు" అని ఆయన తెలిపారు. కేవలం ఒకే మార్కెట్‌పై ఆధారపడకుండా, నూతన మార్కెట్లను అన్వేషించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.తన పర్యటనలో భాగంగా, సముద్ర ఉత్పత్తుల వాణిజ్యంపై ఆస్ట్రేలియాతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు లోకేశ్ చర్చలు జరుపుతున్నారు. సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా (%ూ×ూ%) సీఈఓ వెరోనికా పాపకోస్టా, ఎంగేజ్‌మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్హెర్‌లతో ఆయన సమావేశమయ్యారు. సుస్థిర ఆక్వాకల్చర్, వాణిజ్య అవకాశాలపై వారితో చర్చించారు. "భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 60 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఈ ఎగుమతుల విలువ 7.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 66,000 కోట్లు)" అని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.'గ్రేట్ ఆస్ట్రేలియన్ సీఫుడ్' పేరుతో సొంత బ్రాండ్‌ను సృష్టించి, తమ ఉత్పత్తులను ప్రీమియం మార్కెట్‌కు తీసుకెళ్లిన ఆస్ట్రేలియా విధానం తనను ఆకట్టుకుందని లోకేశ్ అన్నారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని, ఏపీ సీఫుడ్ పరిశ్రమకు అవసరమైన మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.కాగా, అమెరికా సుంకాల వల్ల ఏపీలోని ఆక్వా రంగం సుమారు రూ. 25,000 కోట్ల నష్టాలను చవిచూసిందని, 50 శాతం ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెలలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆయన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌లకు లేఖలు రాశారు. అమెరికాపై ఆధారపడకుండా యూరోపియన్ యూనియన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా తీసుకున్న తాజా నిర్ణయం ఆక్వా రంగానికి కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

## వార నూక రాజు భౌతికకాయనికి ఘన నివాళులు అర్పించిన జీకే వీధి వైసీపీ నేతలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్త వీధి మండలానికి చెందిన వైసిపి నేతలు రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం వైసిపి కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, మండల వైసిపి నాయకులు వార్డు సభ్యులు అరికట్ల ఆంజనేయులు (అంజి) జడ్పిటిసి వారం నూకరాజు యొక్క భౌతిక సహాయాన్ని ఎమ్మెల్యేలు మత్స్య రస విశ్వేశ్వర రాజు, రేగం మత్స్య లింగంలతో కలిసి సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పిటిసి వార నూకరాజును హత్య చేయటం హేయమైన చర్యగా అవివర్ణించారు. దోషులు ఎంతటి వారైనా వారిని పట్టుకుని శిక్షించాలని ఈ సందర్భంగా కోరారు.

# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# రీ సర్వే, మ్యుటేషన్లపై కలెక్టర్ సమీక్ష



**పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి**
**జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్**

**పాడేరు, పెన్ పవర్,అక్టోబర్ 21:** పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు.

కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరెట్ సమావేశ మందిరంలో మంగళవారం రెవిన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే, మ్యుటేషన్లు, ఆర్అండ్ఆర్, ఆర్ఓఆర్, అన్నదాత సుఖీభవ, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన) వంటి కీలక అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. సబ్ కలెక్టర్లు, మండల రెవిన్యూ అధికారులు (ఎం.ఆర్.ఓలు), సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అధికారులతో (వీ.ఆర్.ఓలు) కలెక్టర్ వర్చువల్‌గా మాట్లాడారు.

గ్రామ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత రీ సర్వేలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు మ్యుటేషన్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆధార్ సీడింగ్ పూర్తి కాని వారి వివరాలు సేకరించి, ఆధార్, మ్యుటేషన్ సవరణలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వేలో తలెత్తే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, మండల స్థాయి సమన్వయ కమిటీ ద్వారా పరిష్కరించే విధంగా చూడాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు.

జిల్లాలో భూ సమస్యలను పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. పరిష్కారం కాని భూ తగాదాలు, ఆక్రమణలు, దౌర్జన్యాలను సివిల్ కోర్టుల ద్వారా పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు అత్యంత శ్రద్ధ వహించి పరిష్కరించాలి. ?జీ.ఓ.ఎం.ఎస్. నెం. 30 దరఖాస్తులను అనుమతుల కొరకు ఉన్నతాధికారుల దృష్టికి పంపాలి.

?జీ.ఓ.ఎం.ఎస్. నెం. 23 కింద అర్హత ఉన్నవారికి ఇళ్ల స్థలాలు అందించేందుకు విలేజ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి సమర్పించాలి. ?పెండింగ్‌లో ఉన్న కుల ధృవీకరణ పత్రాల దరఖాస్తులను పరిష్కరించడంలో జిల్లా యంత్రాంగం జాగరూకత వహించాలని, ?పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల



గ్రామ ప్రజలకు ప్రభుత్వ పరిహారం అందేంతవరకు చట్టప్రకారం రావాల్సిన సంక్షేమ పథకాలు అందించాలి.

?పౌర సరఫరాల శాఖ సేవలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, ఎం.ఆర్.ఓలు చౌక ధరల దుకాణాలను విధిగా తనిఖీ చేసి పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐ.టి.డి.ఏ. పి.ఓ. తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత, ఆర్డిఓ ఎం.వి.ఎస్. లోకేశ్వర రావుతో పాటు ఇతర మండల స్థాయి అధికారులు, వీ.ఆర్.ఓలు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం





* కలెక్టర్ విజయ్ కృష్ణన్
* జాతీయ ఏకతా దివస్ వరకు అమరుల వారోత్సవాలు : ఎస్పీ తుహిన్ సిన్హా

**పెన్ పవర్ న్యూస్ బ్యూరో – అనకాపల్లి, అక్టోబర్ 21:** పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ్ కృష్ణన్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అధ్యక్షత వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ – "ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టే పోలీసు సిబ్బంది త్యాగాలు అపారమైనవి. విధి నిర్వహణలో నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతి పోలీసు అధికారి సమాజానికి ఆదర్శం. అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకోవడం మనందరి బాధ్యత. వారి కుటుంబాల పట్ల మనమందరం కృతజ్ఞతతో ఉండాలి," అని తెలిపారు.

ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ – "అక్టోబర్ 21, 1959న చైనా సరిహద్దులో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల స్ఫూర్తితో ఈ దినాన్ని అమరుల సంస్మరణ దినంగా జరుపుకుంటాం. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధి నిర్వర్తనలో వీరమరణం పొందారు, వారిలో 5 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. పోలీసు సేవ సవాళ్లతో కూడినదైనా, సమాజ రక్షణ కోసం సమర్పణతో పనిచేయడం ప్రతి అధికారికి గౌరవకరం," అని చెప్పారు.

అమరుల స్మారక స్తూపం వద్ద పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి, గౌరవ వందనం అందజేశారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబ సభ్యులను సత్కరించి, ప్రతి కుటుంబానికి పదివేలు చొప్పున నగదు చెక్కులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.



అనంతరం ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ – "జాతీయ ఏకతా దివస్ వరకు పోలీసు అమరుల వారోత్సవాలు కొనసాగుతాయని. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్‌లు, వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రజల్లో పోలీసు సేవలపై అవగాహన కల్పిస్తాం," అని అన్నారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, డీఎస్పీలు ఈ.శ్రీనివాసులు, ఎం.శ్రావణి, వి.విష్ణు స్వరూప్, పరిపాలనాధికారి సిహెచ్.తిలక్ బాబు, అలాగే ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, పైడపు నాయుడు, వెంకటనారాయణ, అప్పలనాయుడు, ప్రేమ్ కుమార్, రామకృష్ణ, మన్మధరావు, రమణమూర్తి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## కాఫీ తోట పనికి వెళ్లి యువతీ మృతి-
## నేలపాడు గ్రామంలో విషాదం
## డోలి మోతలో తరలింపు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ అక్టోబర్ 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడా పంచాయతీ నేలపాడు గ్రామంలో కాఫీ తోట పనికి వెళ్లి ఒక యువతి ప్రాణం కోల్పోయిన విషాద సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాంగి సుమిత్ర(22) మంగళవారం తన తోటి వారితో కలిసి కాఫీ తోట పనికి వెళ్తూ ఉండగా



మార్గమధ్యంలో ఆకస్మికంగా సొమ్మచిల్లి పడిపోయింది. స్థానికులు వెంటనే పరిగెత్తి ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నం చేశారు. అయితే గ్రామంలో రోడ్డు సదుపాయం లేకపోవడంతో డోలిమోత కట్టి మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. గ్రామానికి తరలించేటప్పటికీ ప్రాణం కోల్పోయింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి. రోడ్డు సదుపాయం ఉంటే మా కుమార్తె ప్రాణం కాపాడుకోవచ్చు అని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ప్రభుత్వాలు మారిన తమ గ్రామ పరిస్థితి మారలేదని కనీసం అంబులెన్స్ రావటానికి కూడా ఇబ్బందికరమైన స్థితిలో రోడ్డు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు సదుపాయం మా గ్రామానికి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే భవిష్యత్తులో మా పిల్లల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జికి గ్రీన్ సిగ్నల్

**గంటా శ్రీనివాసరావు చొరవతో అడ్డంకులు తొలగింపు**
**విద్యార్థులు, ప్రజల్లో సంతోషం**

**బిమిలి, పెన్ పవర్, అక్టోబర్ 21:** చంద్రంపాలెం ప్రాంత ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ అయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చివరికి మెట్రో అధికారులు అనుమతి ముద్ర వేశారు. భీమిలి ఎమ్మెల్యే శ్రీ గంటా శ్రీనివాసరావు చొరవతో సమస్య పరిష్కార దిశగా కదిలింది.

చంద్రంపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిరోజూ జాతీయ రహదారి దాటి స్కూలుకు వెళ్లే క్రమంలో ప్రమాదాల పాలవుతుండటంతో, స్థానికులు ఎన్నాళ్లుగానో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం కోరుతూ వచ్చారు. జీవీఎంసీ ఇప్పటికే రూ.3.23 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్



ప్రక్రియను ప్రారంభించింది. అయితే, బ్రిడ్జి నిర్మాణం వల్ల అదే మార్గంలో ప్రతిపాదించిన మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఇబ్బంది తలెత్తుతుందని మెట్రో అధికారులు మొదట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డిని కలసి సమస్య వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎత్తుకు మించి మెట్రో డిజైన్ చేయవచ్చని సూచించగా, మెట్రో ఎండీ అంగీకారం తెలిపారు. దీనితో మెట్రో డిజైన్‌ను సవరించి, జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగానికి ఆమోదం తెలిపినట్టు సమాచారం. అడ్డంకులు తొలగడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమమైంది.

ఈ నిర్ణయంతో చంద్రంపాలెం ప్రజలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేట్ కరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించిన వైఎస్ఆర్సిపి నాయకులు.



**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 21.** మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఈరోజు అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం మారుమూల గ్రామపంచాయతీ జర్రకొండ గ్రామంలో నిర్వహించారు వైస్సార్సీ పి వై యస్ జగన్మోహన్ రెడ్డి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు

హుకుంపేట మండలం లో గల జర్రకొండ గ్రామ పంచాయతీలలో మెడికల్ కాలేజీ ల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ కార్యక్రమంలో హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షులు పాంగి. అనిల్ పాల్గొనడం జరిగింది.

గ్రామ పంచాయతీ ప్రజలు అందరు సంతకాలు, మరియు నిసాని లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొర్ర. చిట్టిబాబు వైసీపీ మండల ఉపాధ్యక్షులు కాకరి. వెంకటరావు

కొంతిలి సర్పంచ్ రేగం.రమేష్ మాజీ ఎంపీపీ నైని.బాలన్న చీకుమద్దుల గ్రామ వైస్ సర్పంచ్. మర్రి. ఉత్తరన్న

గణేరుపుట్టు వైస్. సర్పంచ్.వెంకటరావు అప్పన్న, కర్రన్న, గెమ్మెలి. కామేష్ కార్యకర్తలు, నాయకులుహుకుంపేట మండల వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు పాంగి అనిల్ ఉపాధ్యక్షులు కే వెంకట్ కొంతె లి సర్పంచ్ రేగం రమేష్ మండల కమిటీ వై అప్పన్న అలాగే జర్రకొండ పంచాయితీ సర్పంచ్ కే సిట్టి బాబు చీకుమాధుల పంచాయితీ వైస్ సర్పంచ్ మర్రి ఉత్రన్న గేమెల్లి. కామేష్ పంచాయితీ అధ్యక్షులు గేమెల్లి గన్నపతి. పంచాయితీ పెసా సెక్రెటరీ గనేరుపుట్టు పంచాయితీ వైస్ సర్పంచ్ మజ్జి మత్య రాజు బి. వెంకట్ రావు పంచాయితీ అధ్యక్షులు డి. కర్రన్న. పంచాయితీ ఉపాధ్యక్షులు మెరకచింత పంచాయితీ ఎస్ ఆర్ సి పి మాజీ ఎంపీపీ పంచాయతీ కార్యదర్శి వి సింహచలం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# కొయ్యూరు జడ్పిటిసి వారా నూకరాజు దారుణ హత్య





### ఖండించిన పలువురు వైసీపీ నేతలు

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 21:**ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్, ప్రస్తుత కొయ్యూరు జెడ్పిటిసి వారా నూకరాజు దారుణ హత్యకు గురయ్యారు. భూతగాదాలే జడ్పిటిసి నూకరాజు హత్యకు దారి తీసినట్టు తెలుస్తోంది. మండలంలోని చిట్టింపాడుకు చెందిన వార నూకరాజుకు, రోలుగుంట మండలం, చటర్జీ పురానికి చెందిన కొంతమంది ఆదివాసీలకు మధ్య ఎంకేపట్నం రెవిన్యూ గ్రామం పరిధిలోని సర్వేనెంబర్ 139 లోని గల పది ఎకరాల సాగు భూమికి సంబంధించి గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఆ భూమిని తాను కొనుగోలు చేశానంటూ, తన పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయంటూ జెడ్పిటిసి వారా నూకరాజు వాదన కాగా, ఆ భూమిలో తాము ఏళ్ల తరబడి సాగులో ఉన్నామంటూ చటర్జీపురానికి చెందిన ఆదివాసీల వాదన. ఈ విషయమై ఇరు వర్గాలు ఒకరి తరువాత ఒకరు కోర్టులను ఆశ్రయించగా ప్రస్తుతం కోర్టులో వాదనలు నడుస్తున్నాయి. అయితే ఇటీవల పలుమార్లు జడ్పిటిసి వారా నూకరాజు వివాదాస్పద భూమిలోనికి వెళ్లడం, ఆదివాసీలు వాదనకు దిగడం జరుగుతూ వస్తోంది. ఇందులో భాగంగా ఒక దఫా ఇరు వర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుని, నూకరాజు తీవ్ర గాయాల పాలైన సంఘటన కూడా ఉంది. అయితే ఇటీవల మరలా వారా నూకరాజు ఆ భూమిలోనికి ప్రవేశించి ఆదివాసీలకు చెందిన గుడిసెలు దగ్ధం చేసి, అరటి తోటను ధ్వంసం చేసినట్టు ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో జెడ్పిటిసి నూకరాజు దీపావళి రోజు సోమవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆ భూమిలోనికి ప్రవేశించడంతో కొంతమంది గుర్తు తెలియని ఆదివాసీలు ఒక్కసారిగా ఆగ్రహానికి గురై నూకరాజుపై కత్తులతో దాడి చేయడంతో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందారు. దీనితో రోలుగుంట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోమవారం సాయంత్రం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే బాధిత కుటుంబీకులు, వైసీపీ నేతలు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగి ధర్నా చేయడంతో ఆసుపత్రి వద్ద గందరగోళం చోటుచేసుకుంది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితులను సముదాయించి, పోస్టుమార్టం జరిపించగా, అటుపై మృతదేహాన్ని నూకరాజు కుటుంబీకులు స్వగ్రామమైన చిట్టింపాడు తరలించి అంత్యక్రియలు జరిపించారు. నూకరాజు మృతదేహాన్ని వైసిపి నేత రాష్ట్ర మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, మాజీ ఎమ్మెల్యేలు కొ ట్టగుల్లి భాగ్యలక్ష్మి, పెట్ల ఉమా శంకర్ గణేష్, శెట్టి పాల్గుణ, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, వైసీపీ నేతలు కే శివప్రసాద్, జల్లి బాబులు, బొబ్బిలి లక్ష్మణ్, గాడి సత్యనారాయణ, బంది సుధాకర్, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ పలువురు నేతలు వైసిపి శ్రేణులు పరామర్శించి ఘన నివాళులు అర్పించారు.

### హత్యలతో సమస్యలు పరిష్కారం కావు: వైసీపీ నేతలు

ఇదిలా ఉండగా హత్యలతో భూ సమస్యలు పరిష్కారం కావని, కోర్టుల ద్వారానే పరిష్కరించుకోవాలని వైసీపీ నేతలు మాజీ మంత్రి అమర్నాథ్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్ బాబు తదితరులు వేరువేరు ప్రకటనల ద్వారా అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు లోపించాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఇప్పటికైనా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.





# గిరిజన వికాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు గిరిజన వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జి.కె.వీధి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎన్. సత్యనారాయణ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బి.హెచ్.వి. రమణ బాబు మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వ పథకాల సద్వినియోగం చేసుకోవాలంటే ఆధార్, పుట్టిన తేదీ ధృవపత్రం వంటి అవసరమైన పత్రాలను తప్పనిసరిగా పొందాలని సూచించారు. గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ సిబ్బంది సమన్వయంతో అవసరమైన సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజన యువత ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆర్థిక, సామాజికంగా ఎదగగలరని పిలుపునిచ్చారు.వ్యవసాయ శాఖ ప్రతినిధి గిరిబాబు మాట్లాడుతూ "అన్నదాత సుఖీభవ" పథకం, మొక్కల పంపిణీ, పనిముట్ల అందజేత వంటి అంశాలపై వివరణ ఇచ్చారు. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.జీకే వీధి మండల ప్రతినిధి చల్లంగి రాంప్రసాద్ పథకం లక్ష్యాలు, శ్రామికులకు లభించే ప్రయోజనాలను వివరించారు.తహసీల్దార్ హెచ్ అన్నాజీరావు పుట్టిన తేదీ ధృవపత్రం, ఆధార్ కార్డు, భూమి మ్యుటేషన్స్, ఎఫ్ఎం.సి, మరణ ధృవపత్రం తదితర ప్రభుత్వ సేవల గురించి పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ సిబ్బంది రమ్య, యమునతో పాటు 42 గ్రామాల నుంచి సుమారు 80 మంది గిరిజన ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశభక్తి ,మహిళా శక్తి కలయికగా 50,000 చేతితో కుట్టిన జాతీయ జెండాల ప్రాజెక్ట్

- 80 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని
- పురస్కరించుకుని గిన్నిస్ రికార్డు లక్ష్యంగా మహిళా మనోవికాస్ సంస్థ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 21:**దేశభక్తి జ్వాలను మహిళా శక్తితో మేళవిస్తూ విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న మహిళా మనోవికాస్ సంస్థ కొత్త గిన్నిస్ రికార్డు సృష్టించేం దుకు అడుగులు వేస్తోంది. సంస్థ వ్యవస్థాపకురాలు సూరిభట్ల మాధవి ఆగస్టు 2026లో జరగనున్న భారత స్వాతంత్ర్య 80 వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని 50,000 చేతితో త యారు చేసిన జాతీయ జెండాలను రూపొందించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ తిరంగ' ప్రచార స్ఫూర్తితో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా మాధవి, సంస్థ సభ్యురాలు చల్లా మంజుతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ని కలిశారు. స్వయంగా మహిళలు కుట్టిన త్రివర్ణ పతాకాన్ని కలెక్టర్‌కు ప్రదర్శించారు.ప్రస్తుతం 250 మందికి పైగా మహిళలు ఈ జెండాల తయారీలో నిమగ్నమై ఉన్నారని మాధవి తెలిపారు. 2026 ఆగస్టు 15 నాటికి ఈ జెండాలను పాఠశాలలు, కళాశాల లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.ఇది కేవలం ఒక రికార్డు కాదు దేశానికి మహిళల నుండి ఒక గౌరవనివాళి అని ఆమె పేర్కొన్నారు. 50,000 చేతితో తయారు చేసిన జెండాల ప్రాజెక్ట్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కు సమర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది గిన్నిస్ రికార్డులు సాధించిన మాధవి కి ఇది తొమ్మిదవ రికార్డు ప్రయత్నం కానుంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మహిళల్లో ఆత్మవిశ్వాసం, స్వా వలంబన, దేశభక్తిని పెంపొందించే అద్భుత కార్యక్రమం ఇది. ప్రధానమంత్రి దృష్టిలోని మ హిళా సాధికారత భావనతో ఈ ప్రాజెక్ట్ సమపా ళ్లలో ఉంది, అని ప్రశంసించారు.మహిళా మనోవికాస్ సంస్థ చేపట్టిన ఈ కార్య క్రమం దేశభక్తి, మహిళా సాధికారత, సృజ నాత్మకతలకు ప్రతీకగా నిలుస్తోంది. మహిళల చేతుల్లోనుంచి అల్లబడుతున్న ఈ త్రివర్ణాలు భారత జాతి గౌరవానికి కొత్త చరిత్రను సృష్టించే దిశగా ముందడుగు వేస్తున్నాయి.

## మంత్రి వాసంశెట్టి సుభాష్ ఔదార్యం - మానవత్వానికి నిదర్శనం

- దేవాలయం అభివృద్ధికి రూ.50 వేలు, ఇద్దరికీ రూ.20 వేలు ఆర్థిక సహాయం

**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 21:**రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన ఔదార్యాన్ని మరొకసారి చాటుకున్నారు. సామాజిక సేవా దృక్పథంతో ముందుండే నాయకుడిగా మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు.మంగళవారం రామచంద్రపురం పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సుభాష్, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుడైన యనమదల కాశీను చూసి చలించిన మంత్రి, అతనికి రూ.10 వేల రూపాయల చెక్కును ఆర్థికసాయంగా అందజేసి తన సానుభూతిని వ్యక్తం చేశారు. తరువాత శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవాలయానికి దర్శనార్థం వచ్చిన మంత్రి, అక్కడి పూజారి దెందులూరి భద్రరాజు కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీశారు. భక్తులు ఇచ్చే విరాళాలతోనే జీవనోపాధి సాగిస్తున్నానని పూజారి వివరించగా, వెంటనే స్పందించిన మంత్రి సుభాష్ రూ.10 వేల రూపాయల చెక్కును ఆర్థికసాయంగా అందజేశారు.ఇదే సందర్భంలో కాపవరం గ్రామంలోని షిర్డీ సాయిబాబా దేవాలయ అభివృద్ధి కోసం రూ.50 వేల రూపాయల చెక్కును మంత్రి సుభాష్ అందజేశారు.మంత్రి సేవా దృక్పథం, సహృదయతను స్థానికులు ప్రశంసించారు. ప్రజలతో సాన్నిహితంగా మెలిగే నాయకుడిగా, కష్టకాలంలో అండగా నిలిచే మానవతావాదిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ గుర్తింపు పొందారని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఆటో బోల్తా, ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు..!





**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 21:**కట్టెలుకని అడవికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తా పడి, ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక ముగ్గురు తీవ్ర గాయాల పాలైన సంఘటన ఇది. మండలానికి దరిలోని కృష్ణదేవి పేటకు చెందిన రీముల శ్రీను(25), మారే అప్పారావు (50), వెలుసూరి బుజ్జయ్య (60), ములకాడ కొండబాబు (55) ఈ నలుగురు మంగళవారం ఉదయం ఆటోపై మండలంలోని వెలగల పాలెం దగ్గరలోని అటవీ ప్రాంతానికి కట్టెల కని వెళ్లి, తిరిగి వస్తుండగా, బ్రేకులు ఫెయిలై ఆటో బోల్తా పడడంతో, వీరిలో రీముల శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు, తీవ్రంగా గాయపడిన మారే అప్పారావును నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ కి తరలించగా, స్వల్ప గాయాలైన వెలుసూరి బుజ్జయ్య, ములకాడ కొండబాబు కృష్ణదేవిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ విషయమై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 21:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరుల త్యాగాలను స్మరించారు.ర్యాలీలో పోలీసులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ, "దేశ శాంతి భద్రతల కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరుల త్యాగం ఎప్పటికీ మర్చిపోలేము" అని పేర్కొన్నారు.

# భాగస్వామ్య సదస్సు సిద్ధతలపై కలెక్టర్ సమీక్ష





- విశాఖ ప్రతిష్ఠకు ప్రతిబింబంగా చేయాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**విశాఖ దక్షిణం పెన్ పవర్, అక్టోబర్ 21:**నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించబోయే భాగస్వామ్య సదస్సు కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పటిష్ఠ ఏర్పా ట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ కె. మయూర్ అశోక్, సీఐఐ ప్రతినిధులు, నిర్వాహకులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చిన ఆయన, ప్రతి విభాగం తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సదస్సు విశాఖ ప్రతి ష్ఠకు ప్రతిబింబం కానుంది. చిన్నపాటి లోపాల కూ చోటు ఇవ్వకూడదు. ప్రతి విభాగం ముం దస్తు చర్యలు తీసుకుని పూర్తి సమన్వయంతో పనిచేయాలి," అని పేర్కొన్నారు.ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానాన్ని కార్యక్రమ వేదికగా గుర్తించినట్లు తెలిపారు. బుధవారం నుంచే మైదానం లెవెలింగ్ పనులు ప్రారంభించా లని, చిన్న రాళ్లను తొలగించాలని ఆదేశించారు. జీవీఎంసీ, హార్టికల్చర్ శాఖలతో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని, సుందరంగా అలంకరణ లు, పెయింటింగులు చేయాలని సూచించారు.

వీ.ఐ.పీ.లకు ప్రత్యేక సదుపాయాలు

వీఐపీలు, విదేశీ అతిథుల రాక కోసం ప్రత్యేక పార్కింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను స్పష్టంగా గుర్తించాలని ఆయన సూచించారు. అలాగే తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, పారిశుద్ధ్య చర్యలు ముందుగానే సిద్ధం చేయాలని సంబంధిత విభాగాలపై బాధ్యత వేశారు.ఆరోగ్య, భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి డీఎం%ఒ%హెచ్వోకు ఏయూ మైదానంలో అంబులెన్స్, వైద్య సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులకు ఫైర్ సేఫ్టీ తనిఖీలు పూర్తిచేసి అవసరమైన అగ్నిమాపక పరికరాలను సిద్ధం చేయాలని సూచించారు.

సదస్సు ప్రమాణాల ప్రకారం ఏర్పాట్లు

ఏయూ ప్రాంగణంలోని డ్రెయిన్లను శుభ్రపరచి మైనర్ రిపేర్లు చేయాలని, విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి రానున్న ప్రతినిధుల కోసం హొటల్ గదులు, హోమ్ స్టే సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు.

ఆర్ %ఒ% బి శాఖ అధికారులు ప్రధాన వేదికల భద్రతా ప్రమాణాలు పరిశీలించి ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచిస్తూ, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తే భాగస్వా మ్య సదస్సు విశాఖ ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్తుందన్నారు.

## అమ్మవారి ఘటాల ఉత్సవంలో సిరమ్మ ప్రత్యేక పూజలు



- పైడితల్లి అమ్మవారి చల్లదనంలో
- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు



**బిమిలి, పెన్ పవర్, అక్టోబర్ 21 :**విజయనగరం అశోక్‌నగర్ ప్రాంతంలో మంగ ళవారం నిర్వహించిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఘటాలు మరియు చల్లదనం కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె అయిన సిరమ్మ, కమిటీ సభ్యుల ఆహ్వానంపై ఘటోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఘోషా ఆసుపత్రి సమీపంలోని అమ్మవారి చదునులో శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్న ఆమె, అమ్మవారి కరుణ కటాక్షాలు సమస్త భక్తులపై ప్రసరించాలని ప్రార్థించారు. అనంతరం భక్తుల కు స్వయంగా ప్రసాదం వితరణ చేశారు.

ఈ సందర్భంగా స్థానికులు సిరమ్మకు ఘనస్వాగతం పలికి, ఆమె భక్తిశ్రద్ధలను ప్రశంసించారు.

పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని మనసారా కోరుకుంటు న్నాను,అని సిరమ్మ ఈ సందర్భంగా తెలిపారు.

## పేదలకు అండగా శ్రీమన్నారాయణ నిరాశ్రయుల ఆశ్రమం

కాండ్రేగుల గాంధీ, కోయిలడ శంకర్రావు, కనకరాజు, ఆనంద్ కు సత్కారాలు.



**కూర్మన్నపాలెం : పెన్ పవర్, అక్టోబర్ 21**

విశాఖ జిల్లా గొల్లలపాలెం తిరుమల నగర్ లో స్వామి వివేకానంద మదర్ దేరిసా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణ నిరాశయుల ఆశ్రమం పనులు వేగంగా పూర్తవుతున్నాయి. కోయిలాడ శ్రీనివాసరావు అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కి అండగా నిలబడిన ప్రముఖులు కాండ్రేగుల గాంధీ, కోయిలాడ శంకర్రావు,చిరంజీవి అభిమానులు బొంతు కనకరాజుకి, పిఎస్ ఆనంద్ కి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు, ప్రముఖులు అందరూ సహకరించడంతో ఈ రోజు స్వామి వివేకానంద, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణం పనులు చాలా వేగంగా పూర్తవుతున్నాయని తెలిపారు. త్వరలో శ్రీమన్నారాయణ నిరాశయుల ఆశ్రమం నిత్యం సనాతన ధర్మాన్ని బోధిస్తూ పేద ప్రజలకు,అనాధలకు అండగా నిలబడుతుందని తెలిపారు.

ఈరోజు మాకు సహకరించిన కాండ్రేగుల గాంధీ, కోయిలాడ శంకర్రావు,చిరంజీవి అభిమానులు కనకరాజు, ఆనంద్ ఎన్నో ఏళ్ల నుంచి ఆలయాలకు, తమ పుట్టిన గ్రామాలకి ఉన్న ప్రాంతాలకు ఎన్నో సేవలందిస్తున్నారని, ఇటువంటి ప్రముఖులు మాకు అండగా నిలబడడం శుభపరిణామని తెలిపారు. ఈ రోజు తిరుమల నగర్ వెంచర్ ఓనర్స్ శ్రీనివాసరావు , దాము, చిరంజీవి వర్మ ట్రస్ట్ సభ్యులు విద్యుత్ ఏర్పాటు, ఆశ్రమం నిర్మాణం పనులను పరిశీలించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సోమయాజుల కనక లింగేశ్వరరావు, వైస్ చైర్మన్ పెన్మెత్స ఆదినారాయణ రాజు, డైరెక్టర్ దాసరి బుజ్జి, కో ఆర్డినేటర్స్ కోమారా ప్రదీప్ కుమార్, సూరిశెట్టి జోగినాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేద , మధ్య తరగతి ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ కూటమి





- జీఎస్టీ ప్రయోజనాలు విస్తృతంగా ప్రజలకు తీసుకువెళ్లాలి పార్టీ శ్రేణులకు పిలుపు

కరపత్రం విడుదల చేసిన రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు :పల్లా

**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 21**

పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం ఆధ్వర్యంలో జీఎస్టీ వలన పేద ప్రజలకు కలుగు ప్రయోజనాలు వివరిస్తూ వారు రూపొందించిన గోడ పత్రికను పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. గాజువాక నియోజవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంధి రెడ్డి మురళి మనోహర్. ప్రధాన కార్యదర్శి నందిక శివారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జీఎస్టీ లో పెను మార్పులు వల్ల ఈ దేశంలో ఉన్న పేద మధ్యతరగతి కుటుంబాలకు 15 వేల రూపాయల వరకు లాభం చేకూరుతుంది అన్నారు భవిష్యత్తులో దీని ఫలితాలు అద్భుతంగా ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఏ పి ఐ ఐ సి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ వాణిజ్య విభాగ ప్రతినిధులు బంక సత్యనారాయణ అజీజ్ భాష మాడిశ రమణ, ముద్రగడ శ్వేత ,సూర్యారావు, వర్మ కొరికిన చందర్రావు గోమాడ వాసు. సింగూర్ అనంతు %జూ%టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓపెన్ స్పేస్‌లపై ఆక్రమణలకు చెక్

- జీ.వీ.ఎం.సీ.కి గంటా హెచ్చరిక



**బిమిలి, పెన్ పవర్, అక్టోబర్ 21 :**జీవీఎంసీ పరిధిలోని వార్డుల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికను త్వరితగతిన సిద్ధం చేయా లని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.మంగళవారం ఎం.వీ.పీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో మధురవాడ, భీమిలి జోనల్ కమిషనర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, కళ్యాణమండ పాలు, హౌసింగ్, ఈట్‌స్ట్రీట్ వంటి పౌరసదుపాయాల పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, కమిషనర్ కేతన్ గార్గ్ సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఎండాడ మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారుల కోసం ప్రతిపాదించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయా లని ఆదేశించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించబోయే "ఈట్ స్ట్రీట్"ను సాగర్‌నగర్ పరిసరాల్లో ఏర్పాటు చేస్తే ఎక్కువమందికి అందుబాటులో ఉంటుందని అభిప్రాయపడ్డారు. చిల్లపేట చెరువు రిటైనింగ్ వాల్ నిర్మాణం, భీమిలి%-%తగరపువలస మెయిన్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలపై అధికారులు వివరించారు. భీమిలి క్లాక్‌టవర్ నమూనాను త్వరగా సిద్ధం చేయాలని సూచించారు.జీవీఎంసీ పరిధిలోని ఓపెన్ స్పేస్‌లపై జరుగుతున్న ఆక్రమణలపై గంటా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూములను కాపాడేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మొత్తం 149 ఓపెన్ స్పేస్‌లలో ఆక్రమణలు ఉన్నవాటిని తొలగిం చేందుకు చర్యలు ప్రారంభించాలని సూచించారు.ఇప్పటికే 24 పార్కులు అభివృద్ధి చేయగా, ఇంకా 25 పార్కులు అభివృద్ధి దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. దీనిపై గంటా స్పందిస్తూ ,గతంలో వైసీపీ నాయకుల అధీనంలో ఉన్న వైభవ్ నగర్ పార్కులను తిరిగి ప్రజలకే అప్పగించామని, వాటిలో అభివృద్ధి పనులు సమీక్షిస్తున్నామని తెలిపారు. స్థానిక సంఘాలు బాధ్యత తీసుకుంటే పార్కులు మెరుగ్గా అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు.

పార్కుల అభివృద్ధి కోసం 2వ, 4వ వార్డులను ప్రాధాన్యంగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, అయ్యప్పనాయుడు, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కునగరం లో అమృతరావుకు ఘన నివాళి



**కూర్మన్నపాలెం : పెన్ పవర్ ,అక్టోబర్ 21**

ఉక్కు కర్మాగారం కోసం 21రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి విశాఖ ఉక్కు కర్మాగారం వస్తే తెలుగు వారికి ఉద్యోగాలొస్తాయని ప్రాణాలకు సైతం లెక్కచేయలేని ఉక్కు సాధకులు ,ఉక్కు సత్యాగ్రహి,సుభాష్ చంద్రబోస్ తో పాటుగా సైన్యంలో పనిచేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ,గుంటూరు మాజీ శాసనసభ్యుడు తమనం పల్లి అమృతరావు 105వ జయంతి వేడుకను స్టీల్ ప్లాంట్ అమృతరావు పార్కులో ఘనంగా నిర్వహించారు.నిర్వహణ కమిటీ చైర్మన్ ఎవి రమణారావు వైస్ చైర్మన్ జెర్రిపోతుల మోహన్ కుమార్ నిర్వహణ లో జరిగిన జయంతి వేడుకలకు

గాజువాక మాజీ ఎంఎల్ఏ చింతలపూడి వెంకటరామయ్య, వైఎంసిటీ చైర్మన్ వై వరలక్ష్మి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు .

కార్యక్రమం లో ప్రథమం గా చింతలపూడి వెంకటరామయ్య మరియు కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉక్కు పోరాటంలో చనిపోయిన 32మంది అమరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈసందర్భంగా చింతలపూడి వెంకటరమణ మాట్లాడుతూ,

స్టీల్ ప్లాంట్ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఎన్నో ఉద్యమాలు చేసి కార్మికుల కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అవ్వకుండా ఉండడం కోసం మేమంతా ఎంత దూరమైనా పోరాడుతామని తెలియజేస్తున్నానన్నారు. స్టీల్ ప్లాంట్ కి నిధులు కేటాయించామని చెబుతూనే ప్లాంట్ అవసరాలకు కేటాయించకుండా భారం మోపుతున్నారని, విఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను సాగనంపుతు, మరో పక్క వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నారని ,ఇది చాలా అన్యాయమన్నారు. మన రాష్టంతో పాటు పక్కరాష్ట్రాలలో వున్న ఇతర ఉక్కు కర్మాగారాల ప్రైవేటీకరణ ఆపి ,వాటి అభివృద్ధికి నిధులు కేటాయించుకున్నారని, కానీ మన రాష్ట్రంలో ఎండిఏ ప్రభుత్వం అధికారంలో వున్నా సరే ఇప్పటికీ ప్రైవేటీకరణ ఆపేసామనే స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదని, ఓవైపు వివిధ విభాగాల ప్రైవేటీకరణతో పూర్తి స్థాయి ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచారని అన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు తెలుగు వారిగా ఉద్యమాలతో ఉక్కు పాదం మోపుతామని ఈ సందర్భంగా తెలియజేసారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలన వచ్చిన తర్వాత ఇప్పటికీ 9 లక్షల కోట్లు ఇతర ప్రైవేట్ బిజినెస్ మాన్ లకు రుణాలు రద్దు చేశారని, స్టీల్ ప్లాంట్ కున్న ఇరవై వేల కోట్లు అప్పుని రద్దు చేయకుండా గనులు కేటాయించకుండా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడానికి ఎందుకంత మొగ్గు చూపిస్తున్నారో అర్థం కాని పరిస్థితని,ఎనిమిది లక్షల కోట్లు విలువచేసే స్టీల్ ప్లాంట్ భూములను ప్రైవేటీకరణ చేస్తున్నారా లేక ఇరవైవేల కోట్లు అప్పు ఉన్నాయని స్టీల్ ప్లాంట్ ని అమ్మేస్తున్నారన్న విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు.

ఉక్కు చరిత్రలో అమృతరావు ప్రతీ అణువునా వుంటారని, నేడు కర్మాగారంను బ్రతికించాలంటే 5సం ల పాటు అప్పును పెట్టుబడిగా చూపితే తనంతట తానే పుంజుకుంటుందని అన్నారు.

అమృతరావు స్ఫూర్తితో కర్మాగారం కాపాడుకోవాలని, విశాఖ ఉక్కును సెయిల్ లో మెర్జ్ చేయాలని లేదా సొంత గనులు కేటాయించాలని కోరారు .

గాంధీ మిషన్ కన్వీనర్ రమణరావు మాట్లాడుతూ ఆంధ్రులకోసం అమృతరావు ప్రాణాన్నే ఫణంగా పెట్టి విశాఖఉక్కును సాధించారని, కర్మాగారం ఏర్పడ్డాక ఒడుదుడుకులు ఎదుర్కొంటూ లాభాలు ఆర్జించి మేలిమి ఉక్కును ఉత్పత్తి చేసిన ఈ కర్మాగారంకు కూటమి ప్రభుత్వం చేదోడును అందించి కాపాడుకునే ప్రయత్నాలు చిత్త శుద్ధితో చేయాలని విజ్ఞప్తి చేసారు.

కార్యక్రమంలో జె అయోధ్యరాం,పివి రమణ మూర్తి, జెర్రిపోతుల మోహన్ కుమార్,శకునాల చంద్రశేఖర్, యు రామస్వామి,విల్లా రాంమోహన్ కుమార్, దేవులపల్లి సంపూర్ణం, కె పరందామయ్య, డివి రమణయ్య,పోలీస్ నాయుడు, అట్టా అప్పారావు,బూసి వెంకట్రావు, డివి రమణా రెడ్డి, డేవిడ్ రాజు,బొండా ఎల్లాజి, దాసరి సురేష్ బాబు, పులి రమణా రెడ్డి, పితాని బాస్కర్,వైకోటి, వంశీ, రవికుమార్,సూరిబాబు,రమణ తదితదులు పాల్గొన్నారు

## ఆదివాసీ క్రైస్తవ సేవకుల ఐక్యవేదిక





**చింతపల్లి  పెన్ పవర్ అక్టోబర్ 21:**చింతపల్లి  మండల కేంద్రంలో ఆదివాసీ ప్రభావిత ప్రాంత శిక్షణ  జాతీయ ఆదివాసీ క్రైస్తవ సేవకులు ఐక్యవేదిక సమ్మేళనం మంగళవారం రోజు న ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి సీనియర్ పాస్టర్ వి సోమరాజు, పి దేవిద్రాజు, కాలేబు, వసుపరి తిమోతి లు అధ్యక్షత వహించి నిర్వహించారు. ఈ ఐక్యవేదిక సమావేశానికి క్రైస్తవ జాతీయ అధ్యక్షులు కే నిరీక్షణ రావు, జాతీయ సెక్రటరీ ఎం ఎలీషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటరీ ఎం కృపానిధి, తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ దైవప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే క్రైస్తవులు అందరూ ఒకే వేదిక పైకి రావడం అలాగే పరస్పర సహకారంతో ముందుకు సాగడం తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమాజంలో క్రైస్తవులు ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సేవకులు అనేక బాధలు కష్టాలు అణచివేతలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ తరుణంలో క్రైస్తవులందరూ ఐక్యంగా ఉండడం అత్యవసరమని సంఘంలో ప్రేమ, శాంతి, సమాధానం, సహనంతో ముందుకు అడుగులు వేయాలన్నారు ఈ సమావేశంలో పాడేరు, జి మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల నుండి వచ్చిన సేవకులు మరియు సంఘ సభ్యులను జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రైస్తవ సంఘ కమిటీ సభ్యులుగా నియమించినట్లు నిర్వాహకులు తెలిపారు. దీనివలన వారి సేవా కార్యక్రమాలకు రెట్టింపు ఉత్సాహాన్ని కలిగిస్తుందని భావిస్తున్నామన్నారు. క్రైస్తవ ప్రజలు ప్రార్థనలు నిర్వహించి దేశంలో శాంతి ,ఐక్యత క్రైస్తవ సంఘ లోపే బలోపేతం కోసం దేవుని ఆశీస్సులు కోరారు. ఈ సమావేశ ఫలితంగా ఆదివాసి క్రైస్తవుల మధ్య ఐక్యత అవగాహన సేవాభావం ఉత్సాహంగా పెరిగే అవకాశం ఉందని విశ్వాసంతో ఈ ఉద్యమం రాష్ట్రస్థాయిని దాటి జాతీయస్థాయిలో మరింత విస్తరించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండలం నుండి జోసెఫ్, సామ్యూల్, చింతపల్లి నుండి టి రవి, వినోద్, భూషణం, జీకే వీధి నుండి జాన్ పాల్, యేసు రాజు, తిమోతి, కొయ్యూరు మండలానికి చెందిన జోసెఫ్ గాబ్రియల్ మరియు ఐదు మండలాల పాస్టర్లు విశ్వాసులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పర్యటనలో ప్రభుత్వ విప్ గణబాబు





**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 21:**
విశాఖపట్నం నగరంలో అభివృద్ధి పనులకు నూతన ఊపు అందుతోంది. ఈ క్రమంలో గోపాలపట్నం 91వ వార్డులో ఉన్న సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఉదయం ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. ప్రస్తుతం సదరం అప్పలనాయుడు మార్గం నుండి నేరుగా సింహాచలం రైల్వే స్టేషన్ కి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “సింహాచలం ప్రాంతం ఒక ప్రాచీన పవిత్ర క్షేత్రం కావడంతోపాటు, రైల్వే స్టేషన్ ద్వారా అనేక మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణిస్తున్నారు. ఇటువంటి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు నివారణకు త్వరితగతిన చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం,” అని తెలిపారు. ఈ పర్యటనలో జోన్ 8 జోనల్ కమిషనర్ శంకరరావు, టీడీపీ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడీ రమణ, కూటమి నేతలు, జీవీఎంసీ అధికారులు, పోలీసు శాఖాధికారులు, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వారు కలిసి మార్గాల పరిశీలన చేయడంతో పాటు, భవిష్యత్ చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ దుస్థితి పరిష్కారానికి తాత్కాలిక మరియు శాశ్వత చర్యలు, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చ, ప్రభుత్వ విప్ గణబాబు పర్యటన పట్ల స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అంగరంగ వైభవంగా స్వామివారి నిత్య కళ్యాణం






**సింహాచలం, పెన్ పవర్, అక్టోబర్ 21 :** శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి పుణ్యక్షేత్రం సింహాచలంలో నిత్య కల్యాణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించబడింది. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా నిలిచిన ఈ ప్రాచీన దేవస్థానంలో జరిగే నిత్య కల్యాణం భక్తుల హృదయాలను అలరిస్తూ విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవమూర్తి శ్రీ గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో కలసి మండపంలో అధిష్ఠింపజేశారు. అనంతరం, పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కళ్యాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర బెల్లం వేయించడం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఉత్సవం వంటి సంప్రదాయ కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించబడ్డాయి. ఈ పర్వదినంలో పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదం అందజేయడం ద్వారా స్వామివారి కృపను పొందే అవకాశం కల్పించబడింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, కళ్యాణోత్సవ దృశ్యాలను తిలకిస్తూ సంతోషంగా నిలిచారు. అనంతరం స్వామివారి అంతరాలయ దర్శనాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. “స్వామివారి సేవలో సదా నిమగ్నంగా ఉన్న దేవస్థాన కార్యనిర్వాహకుల కృషి ప్రశంసనీయమని” భక్తులు అభిప్రాయపడ్డారు.

## అమావాస్య సందర్భంగా వైభవంగా గ్రామ తిరువీధి ఉత్సవం

### సింహాచలం శ్రీ స్వామివారి దర్శనంతో భక్తులు పులకింత







**సింహాచలం, పెన్ పవర్, అక్టోబర్ 21 :** సింహాచల క్షేత్రంలో శ్రద్ధా భక్తులతో అమావాస్య వేళ వైభవంగా గ్రామ తిరువీధి ఉత్సవం నిర్వహించబడింది. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామివారి సన్నిధిలో భక్తులు అపారంగా తరలివచ్చి స్వామివారి దివ్యమంగళ దర్శనం పొందారు. స్వామివారు సువర్ణ రథంపై ఊరేగి గ్రామ వీధుల్లో విహరించగా, భక్తులు పలువిధాలుగా స్వామివారిని ఆరాధిస్తూ పూజలు చేశారు. ఈ సందర్భంగా నాలాయిర అధ్యాపకులు ఆలయ ప్రాంగణంలో దివ్యప్రబంధ గానం నిర్వహించారు. ఆలయాన్ని మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన ఆధ్యాత్మిక విద్వాంసులతో కూడిన వేద పండితులు గోష్ఠి రూపంలో వేద పారాయణం నిర్వహించగా, వాయిద్యాల నినాదాలతో మంత్రోచ్చారణలు భక్తజన హృదయాలను హరిశించాయి. స్వామివారి పాద దర్శనానికి యాత్రికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ తిరువీధి ఉత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ కూడా చేపట్టబడింది. ఆలయ అధికారులు భక్తులకోసం ఏర్పాట్లు సమగ్రంగా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ, “భక్తుల భద్రత, సౌకర్యాలు కచ్చితంగా కల్పించాం. ప్రతి ఉత్సవం లోనూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు మేము ఎప్పుడూ సన్నద్ధంగా ఉంటాం” అని తెలిపారు.

## మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం





**కూర్మన్నపాలెం : పెన్ పవర్ ,అక్టోబర్ 21** జీవీఎంసీ 87 వార్డు పరిధిలో గల కణితి కాలనీ  పద్మశాలి వీధి లో 87 వార్డు అధ్యక్షుడు  బొడ్డ గోవిందా ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు గాజువాక వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ తిప్పలు దేవన్ రెడ్డి  ఆదేశాల మేరకు 87 వార్డు పద్మశాలి వీధిలో ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేశారు వార్డ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమానికి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వైసిపి 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపట్టారు ప్రభుత్వ ఉన్న ఐదు సంవత్సరాల్లో 7 కాలేజీలు పూర్తయ్యాయి మిగతా కూడా చివర విడతలో ఉన్నాయని వాటిని కూటమి ప్రభుత్వం 17 కాలేజీలను ప్రైవేటు ప్రైవేటీపరం వాటి వల్ల పేద విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని దానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్ గారికి సమర్పించాలని దాన్లో భాగంగా ఈరోజు అ  87వ వార్డు లో కోటి సంతకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు 87వార్డు వైఎస్ఆర్సిపిఅధ్యక్షుడు  బొడ్డ గోవిందా , కణితి గ్రామ దేవతల కమిటీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, గాజువాక బీసీ సెల్ అధ్యక్షుడు చిత్రాడ వెంకటరమణ, సీనియర్ నాయకులు ఎన్నేటి. రమణ,ముద్దపు దామోదర్, జిల్లా వైసిపి వాణిజ్య విభాగం కార్యదర్శి దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, బొడ్డ సన్యాసిరావు,బి వెంకటసురి, బడగల రాము,ఎల్ఐసి నాయుడు,డీ. అప్పడు, దొడ్డి కనకరాజు, చిత్రాడ గంగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామం పరికరాలు ,  పిల్లల ఆట పరికరాలను ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం





**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 21**
పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధి వడ్లపూడి శ్రీ గణేష్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామం పరికరాలు, పిల్లల ఆటల పరికరాలు  మరియు ఐమాక్స్ లైట్స్ ను రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం  ప్రారంభించారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని నిధులు మంజూరు చేయించి  వార్డ్ అభివృద్ధి చేస్తూ అభివృద్ధిలో విశాఖ జిల్లాలో మొదటి స్థానంలో నిలబెట్టే విధంగా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజన్ రాజు, పావాడ రమణమూర్తి  సూరిశెట్టి పెంటారావు,బొట్టా ప్రకాష్, ఆనంద్ కుమార్, కడుపుట్ల శ్రీను, సుందర్ సునీల్, శ్రీ గణేష్ నగర్ అసోసియేషన్ సభ్యులు తాతారావు, వెంకటరావు, వెంకటేశ్వరరావు, సతీష్ కుమార్, శివయ్య, ఆచారి, సంధ్య, కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖ శ్రీ శారదా పీఠంలో కార్తీక మాసోత్సవాలు





**ఆధ్యాత్మిక వైభవం భక్తి, జ్ఞానం, శాంతి పరంగా ఆహ్వానం**

**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 21 :** విశాఖలోని శ్రీ శారదా పీఠం జ్ఞాన, భక్తి, ధర్మ పరంపరల నిలయంగా పేరొందిన ఈ ఆధ్యాత్మిక కేంద్రం ౧ ఇప్పుడు కార్తీక మాసోత్సవాల నేపథ్యంలో శివభక్తితో ముంచెత్తుతోంది. అక్టోబర్ 21వ తేదీన ప్రారంభమైన ఈ మాసోత్సవాలు, నవంబర్ 20వ తేది వరకు అఖండంగా సాగనున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రతి రోజు భక్తులకు ఆధ్యాత్మికంగా మునిగిపోయే అవకాశాలు సమృద్ధిగా లభిస్తున్నాయి.

**ఆరంభోత్సవంలో ఆకాశదీపం..**

ఉత్సవాల తొలి రోజున జరిగిన ఆకాశదీప కార్యక్రమం, భక్తుల మనస్సులను పరవశింపజేసేలా సాగింది. వెలుగు బాట చూపే ఆ దీపాలతో పీఠం ప్రాంగణం అద్భుతమైన ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శివునికి ఎంతో ప్రీతికరమైన దీపదానం కార్యక్రమం ద్వారా కార్తీక మాసం ప్రారంభమవడమే భక్తుల్లో విశ్వాసాన్ని మరింత బలపరుస్తోంది.

**ప్రతిరోజూ – ఆధ్యాత్మికం, అనుసంధానం..**

ఈ మాసం అంతా ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక జీవితాన్ని మరింత సమృద్ధిగా గడిపే అవకాశాన్ని కలిగిస్తున్నాయి. ఉదయం 7:30 గంటలకు భక్తులు తమ స్వహస్తాలతో నర్మదా బాణలింగం, శ్రీ చంద్రమౌలీశ్వరుని అభిషేకం చేయగలగడం ఎంతో అరుదైన దైవసంపర్కం. సాయంత్రం 6:00 గంటలకు: కార్తీక దీపోత్సవం శివకేశవులకు నివేదించిన దీపారాధన, భక్తి శ్రద్ధల సమ్మేళనం. సాయంత్రం 6:30 గంటలకు కార్తీక పురాణ ప్రవచనాలు, పురాణపండితుడు శ్రీ ప్రయాగ రమణ శర్మ జ్ఞానసంపర్కంతో భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక వెలుగు నింపుతున్నాయి.

**కార్తీక మాసం – పుణ్యకాల మహిమ..**

కార్తీక మాసం విశిష్టతను పురాణాలు విశదంగా వివరించాయి. “ఒక్క దీపం వెలిగించినా కోటి దీపాల పుణ్యఫలం లభిస్తుంది” అన్న వాక్యం ఈ మాసంలోని పుణ్యతను స్పష్టంగా తెలిపుతోంది. దీపదానం, జపం, ధ్యానం, అభిషేకం వంటి అనేక దివ్య కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ఫలదాయకంగా పేర్కొనబడ్డాయి.

**పీఠాధిపతుల మార్గదర్శనం – భక్తులకో దివ్యానుభూతి..**

ఈ ఉత్సవాలకు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి మరియు ఉత్తర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివార్ల ఆధ్యాత్మిక పర్యవేక్షణ భక్తులకు మరింత భరోసానిస్తుంది. భక్తి, జ్ఞానం, శాంతి మరియు శ్రేయస్సు పరంగా ఈ ఉత్సవాలు ఎంతో గొప్ప మార్గదర్శకాలు. విశాఖ శ్రీ శారదా పీఠంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాలు, భక్తుల హృదయాల్లో భక్తిరసాన్ని పారదోలుతున్న ఈ శుభ సమయంలో, ఆధ్యాత్మిక మార్గంలో ఓ అడుగు ముందుకు వేయాలనుకునే వారందరికీ ఇది ఒక అరుదైన అవకాశం. భక్తితో చేయబోయే ప్రతి చిన్న కార్యానికీ కోటి గుణ ఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అలాంటి విశిష్ట కాలాన్ని నిర్లక్ష్యం చేయకుండా, జ్ఞానోదయాన్ని ఆశిస్తూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పీఠం తరఫున ఆహ్వానం.

# అన్న క్యాంటీన్ లలో లోపిస్తున్న నాణ్యత





**అధికారులు ఆకస్మిక తనిఖీల వరకే చర్యలు శూన్యం**

**సగం ఉడికిన అన్నం రుచిలేని కూరలు**

**అధిక శాతం తనిఖీలు అల్పాహారం వరకే ! మధ్యాహ్నం రాత్రి భోజనం తనిఖీలు చేయరా!**

**పారవేస్తున్న అన్నం కూరలు**

**అర్ధాకలితో తిరుగు ముఖం**





**విశాఖ తూర్పు పెన్ పవర్ అక్టోబరు 21:** తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదు రూపాయలకే భోజనం పథకం అన్న క్యాంటీన్ పర్యవేక్షణ లోపం,నాణ్యతలేని ఆహార పదార్థాలు సరఫరా సగం ఉడికిన అన్నం రుచి లేని కూరలు తింటున్న అన్నం వదిలి డస్ట్ బిన్ లో పడవేస్తూ అర్ధాకలితో ఐదు రూపాయల భోజనం ఇంతకంటే ఏముంటుంది దానికి ఫిర్యాదులు ఎందుకులే అంటూ తిరుగు ముఖం పడుతు పేద మధ్యతరగతి ప్రజలు.

ఎన్నికల హామీలు భాగంగా కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి పేద ప్రజల మన్నలను పొందినది. పేద మధ్యతరగతి ప్రజల ఆకలని తీరుస్తున్న అన్న క్యాంటీన్లు పర్యవేక్షణ లోపం అధిక సంఖ్యలో ఆహార పదార్థాలు తయారు చేయడం కారణాలు ఏమైనా పనికి అధిక శాతం నాణ్యత లోపిస్తున్న హరపదార్థము పంపిణీ జరుగుతున్నాయి అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సందర్భంలో ఐదు రూపాయలకు ఏమొస్తుంది ఇంతకన్నా మంచి భోజనం ఇవ్వగలరా అంటూ ఐదు రూపాయలకే భోజనం అంటే ఇలానే ఉంటుందని ఎవరికి వారు సర్ది చెప్పుకుంటూ మౌనంగా వెళ్ళిపోతున్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్. జీవీఎంసీ జోన్ 2 కమిషనర్ కనకమాలక్ష్మి.

ఎ ఎం హెచ్ ఓ రాజా రవికుమార్. టిడిపి నాయకులు కెల్లా సత్యనారాయణ. మంగళవారం ఉదయం ఆరిలోవలో గల అన్న క్యాంటీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను పరిశీలించారు ఆహార పదార్థాల నాణ్యతను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

పనిచేయని ఫిల్టర్ ప్లాంట్, అన్న క్యాంటీన్ కి ఎదురుగా ద్విచక్ర వాహనాలు నడక మార్గాలను ఆక్రమిస్తున్న కార్లు, ఇతర వాహనాలతో అన్నా క్యాంటీన్ లోనికి రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు. రాత్రి సమయంలో చీకటిలో అన్నా క్యాంటీన్,వెలగని అన్న క్యాంటీన్ ప్రధాన బోర్డు, వెలుగునివ్వని విద్యుత్ దీపాలు. నీరు వాడుతున్న అన్నం,సగం ఉడికిన అన్నం,లెక్క తప్పిన సాంబారు సరఫరా పలు సమస్యలు తాండవిస్తున్నా తనిఖీల వరకే పరిమితం అవుతున్న అధికారులు చర్యలు శూన్యం అంటున్న ప్రజలు, ఇప్పటికైనా అధికారులు స్పందించి తనిఖీలకే కాకుండా చర్యలు చేపట్టాలని నాణ్యమైన ఆహార పదార్థాలు అందజేసే విధంగా చర్యలు ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

## సీలేరు పంపుడు స్టోరేజ్ ప్రాజెక్టుకు ప్రజల వ్యతిరేకం లేదు - డిమాండ్లు నెరవేర్చాలని హామీ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 21:** అల్లూరి జిల్లా సీలేరు ప్రాంతంలో ప్రతిపాదిత పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజలు వ్యతిరేకం కాదని, అయితే ప్రాజెక్టు వలన నష్టపోతున్న ప్రజలకు సరైన పరిహారం చెల్లించడంతో పాటు, అన్ని సదుపాయాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. మంగళవారం సీలేరు జెన్‌కో అతిథిగృహంలో జెన్‌కో అధికారులు, స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జెన్‌కో అధికారుల దృష్టికి తమ డిమాండ్లను తీసుకెళ్లారు. సీలేరు పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇళ్ల నిర్మాణానికి సరైన స్థలం, తాగునీటి సదుపాయాలు ఇవ్వాలని కోరారు. ప్రజా అభిప్రాయ సేకరణలో ఇచ్చిన హామీలు నెరవేర్చితే ప్రాజెక్టుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

**“ప్రజా డిమాండ్లను నెరవేర్చుతాం”– జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు**

సీలేరు గ్రామస్థులతో సమావేశమైన జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో యాజమాన్యం కట్టుబడి ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ సమన్వయంతో కూడా పలు అంశాలు పరిష్కరించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు.

**“ఏ గ్రామానికి నష్టం జరగదు” – జెన్‌కో అధికారులు**

ప్రాజెక్టు నిర్మాణం వలన ఏ గ్రామానికీ నష్టం జరగదని, ప్రాజెక్టు పూర్తిగా భూమి అడుగుభాగంలోనే నిర్మించబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నకుమార్ తెలిపారు. భూములకు ఎటువంటి నష్టం జరగదని, గ్రామాల తొలగింపు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం కచ్చితంగా ప్యాకేజీ అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ బాలకృష్ణ, ఏడీఈ అప్పలనాయుడు, జైపాల్, ఏఈఈ సురేష్ తదితర జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

## కాలభైరవుడికి అశ్వజ బహుళఅమావాస్య సందర్భంగా మహాభిషేకం. క్షీరాభిషేకాలు



**గాజువాక: పెన్ పవర్ , అక్టోబర్ 21** జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామికి అశ్వజ బహుళ అమావాస్య సందర్భంగా మహాభిషేకం క్షీరాభిషేకం ప్రత్యేక హెూమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల అధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ అశ్వజ బహుళ అమావాస్య కార్తీక మాసంలో వచ్చే అమావాస్య పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హెూమంలు చేయడం జరిగిందని దీనివల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాల బైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. మీ యొక్క పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారిద్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట నాగేశ్వరరావు మరియు ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు

# గిరిజనులకు నష్టం జరగకుండా చర్యలు

**జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్**

**పాడేరు, పెన్ పవర్,అక్టోబర్ 21:** గిరిజనులకు నష్టం జరగకుండా చర్యలు, మాడగడ, వనజాంగి ఎకో టూరిజం భూముల సర్వేపై సమీక్ష, పాత రికార్డులు పరిశీలించి, పక్కా ప్రణాళికతో రీసర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశం

ఎకో టూరిజం ప్రాజెక్టుల వల్ల మాడగడ, వనజాంగి గ్రామస్తులు ఎటువంటి నష్టం పోకుండా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ నుండి సంబంధిత శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ అంశంపై సమీక్షించారు. ?ఎకో టూరిజం కోసం మంజూరైన భూముల సర్వే గతంలో ఏ విధంగా జరిగిందనే దానిపై కలెక్టర్ ఆరా తీశారు. “పాత డేటా తీసి తనిఖీ చేయండి. భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రాకుండా సర్వే చేయాలి” అని అధికారులను ఆదేశించారు.

ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మండల రెవెన్యూ అధికారి (ఎం.ఆర్.ఓ.), మండల సర్వే అధికారి సమన్వయంతో కలిసి పక్కా ప్రణాళికతో రీసర్వే ప్రక్రియను ఎటువంటి విచలనం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ మరియు పాడేరు ఐ.టి.డి.ఏ. ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీ పూజ, పాడేరు డివిజనల్ ఫారెస్ట్ అధికారి పి.వి. సందీప్ రెడ్డి, ఏ.డి. సర్వే కె. దేవేంద్రుడు, అరకు ఎం.ఆర్.ఓ. సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.



# ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:**ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో మండలములోని మోహనాపురం ఎల్లాపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆశ్రమం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గిరిజనులకు అవసరమైతే విశాఖపట్నం తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ వీరపురెడ్డి, ఆంధ్రవనవాసి కళ్యాణ ఆశ్రమం ప్రతినిధులు కాటంరెడ్డి ,రామకృష్ణారెడ్డి ,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలి: ఎస్ జి వి సుబ్బరాజు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 21:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలని నీటి సంఘం అధ్యక్షులు ఎస్ జి వి సుబ్బరాజు అన్నారు. మండల పరిధి లింగంపర్తి గ్రామ సచివాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యార్లగడ్డ చంద్రలేఖ అధ్యక్షతన జరిగిన సభలో సుబ్బరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో గతంలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడా అటువంటి ఆరోపణలు రాకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలన్నారు. మన ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని సకాలంలో రైతులకు సాగునీరు అందేలా పనులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అవకతవకులు జరిగినట్లు ఆరోపణలు వస్తే నిర్దాక్షిణ్యంగా అట్టివారిపై అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట శ్రీధర్, ఎస్సీ సెల్ కార్యదర్శి నూకతాటీ ఈశ్వరుడు, బిజెపి కూటమి నాయకులు,ఉపాధి హామీ పథకం అధికారులు, ఉపాధి కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో విస్తరించాలి



### కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:**పశుసంవర్ధక రంగం అభివృద్ధి రైతు ఆదాయాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో బలంగా విస్తరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల అమలు, మండలాల వారీగా సాధించిన పురోగతిని సమీక్షించి, అధికారులు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గోకులం షెడ్ల లక్ష్యాలను సాధించేందుకు రైతుల నుండి దరఖాస్తులు సేకరించి మంజూరు తీసుకోవాలన్నారు. బహు వార్షిక పశుగ్రాసాల లక్ష్యాలను సమయానికి సాధించాలని, కె పి ఐ ఆధారంగా ప్రతి మండలంలోని పురోగతిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంలో తెల్ల జాతి పశువుల ప్రాముఖ్యతను గుర్తించి, పశు ఆరోగ్య కార్యకర్తలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయం తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం పై పశు ఆరోగ్య కార్యకర్తలకు పూర్తి శిక్షణ, మార్గదర్శకాలు నిరంతరం ఇవ్వాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం పై పశు ఆరోగ్య కార్యకర్తలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. టి. శ్రీనివాసరావు, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్లు డా. సుంకవల్లి సత్యనారాయణ (కొవ్వూరు), డా. మక్కెన వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం), సబ్‌డివిజనల్ ఏరియా వెటెరినరీ హాస్పిటల్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ద్రాక్షారామంలో కార్తీకమాసం ఏర్పాట్లపై మంత్రి సుభాష్ సమీక్ష

**భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు**





**రామచంద్రపురం, పెన్ పవర్ అక్టోబర్ 21:**దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో జరగబోయే కార్తీకమాసం వేడుకల ఏర్పాట్లపై రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం అధికారు లతో సమీక్ష నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, దేవాదాయ, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు ముందుగానే సమన్వయం తో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. "భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు అందించే ఏర్పాట్లు చేయాలి" అని మంత్రి ఆదేశించారు. అలాగే, ఎండ తీవ్రత దృష్ట్యా వాటర్‌ప్రూఫ్ టెంట్లు, భద్రతా చర్యలు,వైద్య సదుపా యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరాల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని శాఖల సమన్వయంతో ఈసారి కార్తీకమాసం ఉత్సవాలను మరింత అనుభవపూర్వకంగా, ఘనంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రఘువీర్, దేవాలయ సహాయ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గా భవాని, ద్రాక్షారామం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి పార్టీ నాయకులు, అర్చకులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలగట్టలేనివి.

**అమరులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సెన్లకు నివాళులు అర్పించిన ఆలమూరు,ఎస్సై జి నరేష్.**



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 21:**ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనవి, వారి కుటుంబాలకు యావత్ భారతదేశం తోడుగా ఉన్నామని తెలియజేసే మహత్తరమైన రోజే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవమని ఎస్సై జి నరేష్ అన్నారు. మంగళవారం స్థానిక స్టేషన్ వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్సై ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్మరణ స్థూపం చిత్రపటం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు ఎస్సై నరేష్, సిబ్బంది అమరవీరుల కుటుంబసభ్యులకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 1959వ సంవత్సరము అక్టోబరు 21వ తేదీ జమ్మూ కాశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో మనదేశ సరిహద్దు అయిన లడాక్ భూ భాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్లకు నివాళిగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టిన పోలీస్ సిబ్బందికి తమ ప్రగాఢ నివాళి అర్పిస్తున్నామన్నారు. దేశం కోసం పోలీసు అధికారులు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరవలేనివని, వారు మన సమాజంలో ధైర్యం, సేవాభావం, నిబద్ధతలకు ప్రతీకలన్నారు. వారి కుటుంబాలకు మద్దతుగా, అండగా నిలబడటం మనందరి కర్తవ్యంగా భావించాలని, అదే వారిపట్ల మనం చూపగల అత్యున్నత నివాళిగా ఎస్సై నరేష్ పేర్కొన్నారు. అనంతరం ఇటీవల విధి నిర్వహణలో భాగంగా అమరులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సెన్లకు నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 21**: జగ్గంపేటలో అక్టోబర్ 31, నవంబర్ 1న భవన నిర్మాణ కార్మికుల కాకినాడ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సిఐటియు)జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఇర్రిపాకలో మహాసభల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల మహాసభల్లో రానున్న మూడేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏవిధంగా పోరాడాలి, గడిచిన మూడేళ్లలో మనం చేసిన పోరాటాలు ఇవి మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల 25 లక్షల మంది కార్మికులు ఈ సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నారని, సంక్షేమ బోర్డు అమలు కాకుండా జగన్మోహన్ రెడ్డి అన్యాయంగా 1214 మెమో తీసుకొచ్చారని ఎటువంటి క్లైములు విడుదల కాకుండా అడ్డుకున్నారన్నారు. దీని ఫలితంగా 2024లో జగన్మోహన్ రెడ్డికి భవన నిర్మాణ కార్మికులు సమాధానం చెప్పడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలు చేయాలని సంక్షేమ బోర్డు పథకాలు అమలు కాకుండా అడ్డుపడిన జీ.ఓ నెం1214 మిమల్ని రద్దుచేసి పెండింగ్ క్లైములు, పరిహారాలు ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కాపాడుడం కోసం కార్మికులంతా అందరూ ఐక్యతతో ఉద్యమించాలని సందర్భంగా అన్నారు. ఈ మహాసభలపను జయప్రదం కోసం కార్మికులు, ప్రజలు ,ప్రజాప్రతినిధులు హార్దిక ఆర్థిక సహకారం అందించి జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట యూనియన్ నాయకులు కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, కెంగం బాబ్జి, అన్నవరం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టును ఢీకొన్న ఇన్నోవా బీఎస్ఎఫ్ జవాన్ మృతి,

**ఆరుగురికి తీవ్ర గాయాలు**





**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 21:**చింతూరు మండలంలోని కూనవరం వెళ్లే జంక్షన్ సమీపంలో గొర్లగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారి 30పై తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒరిస్సా రాష్ట్రం బలిమెలలోని బీఎస్ఎఫ్ 142 బెటాలియన్‌కు చెందిన ఏడుగురు జవాన్లు ఖమ్మం నుంచి బలిమెలకు ఇన్నోవా కారులో వెళ్తుండగా, చట్టి జంక్షన్ దగ్గరలోని కల్వర్టును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ గోమిటినగర్‌కు చెందిన జవాన్ గౌరవ్ కుమార్ పాండే (43) దురదృష్టవశాత్తు మృతిచెందగా, మరో ఆరుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ముందుగా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21**:పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని

ప్రస్తుత తరుణంలో పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని అఖిలపక్ష నాయకులు అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు అఖిలపక్ష నాయకులు ర్యాలీ కొవ్వొత్తుల నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీసులు సమాజ రక్షకులని వారు లేకుంటే సమాజం అల్ల కల్లోలమవుతుందన్నారు. చైనా యుద్ధంలో గ్లాసియర్ ప్రాంతంలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించేందుకు పోలీసుల అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని చెప్పారు. పోలీసుల త్యాగాలు వెలకట్టలేవని ప్రతి ఒక్కరూ వారి త్యాగాలను కొనియాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి ఇరుముడి సమర్పణ



**ఏలూరు అక్టోబర్ 22 పెన్ పవర్** : భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో 41 రోజులపాటు అయ్యప్ప స్వామి వారి దీక్షను చేసిన ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు మంగళవారం శబరిమలై అయ్యప్పను దర్శించుకుని ఇరుముడి సమర్పించారు. అయ్యప్ప స్వామి వారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు వెళ్లిన పలువురు అయ్యప్ప భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు..

# మేయర్ మనవడు పుట్టినరోజు వేడుకలు



**ఏలూరు అక్టోబర్ 21 పెన్ పవర్ :** ఏలూరు నగర మేయర్ మనవడు దేవాన్ష్ కు అయ్యప్ప స్వామి మరియు మాల ధారణ చేసిన స్వాములు ఆశీస్సులు అందించాలని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ శ్రీమతి షేక్ నూర్జహాన్-ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు కోరారు. తమ మనవడు షేక్ దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక దొండపాడు లోని బాల అయ్యప్ప క్షేత్రంలో మంగళవారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు,స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ కమిటీ సభ్యులు కార్తీమాసం రోజుల్లో స్వాములకు భిక్ష కార్యక్రమ%శీ% ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. మ మనవడు దేవాన్ను పుట్టినరోజు సందర్భంగా భిక్ష ఏర్పాటు చేయడానికి తమకు అవకాశం కల్పించినందుకు కమిటీ సభ్యులను అభినందించారు. స్వాములు మనస్ఫూర్తిగా బిక్షను ఆరగించాలన్నారు. తమ మనవడు దేవాన్ష్కు మాలధారణ చేసిన స్వాములందరూ ఆశీస్సులు అందించాలని మేయర్ నూర్జహాన్ పెదబాబు కోరారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ మూర్తి**





**గంగవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 21:** ప్రజల రక్షణ కోసం, సమాజంలో శాంతి భద్రతల స్థాపన కోసం నిత్యం పోలీసులు పాటుపడతారని, విధి నిర్వహణలో అమరులైన పోలీసులత్యాగలు మరువలేనివని అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం పోలీసుఅమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా గంగవరం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థిని విద్యార్థులతో కలసి వై జంక్షన్ లో మానవహారం చేపట్టారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959అక్టోబర్ 21న చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి అమరులైన 10మంది సిఆర్పిఫ్ జవానులను గుర్తు చేసుకుంటూ ఈ దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, వారి కుటుంబ సంతోషాలకంటే, ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తారని అన్నారు. ప్రజలు కూడా పోలీసులను తమ నేస్తాలుగా భావించాలన్నారు. అలాగే పోలీసు వ్యవస్థ పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ లు రజాక్, మహర్షి, ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు దొర ,పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెల రోజులు కార్తిక వన సమారాధన కమిటీ ..

- కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వన సమారాధన..
- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 21: కోరిన కోర్కెలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నెలరోజుల పాటు కార్తిక వన సమారాధనకు ఎమ్మెల్యే బత్తుల కమిటీ ఏర్పాటు.ఈ సందర్భంగా నెలరోజుల పాటు జరుగు కార్తీక వన సమారాధనకు బుధవారం ఉదయం పది గంటలకు కూటమి నాయకులతో మీటింగ్ ఏర్పాటు చేసి భక్తులకు అన్న ప్రసాదం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు అందరూ హాజరు కావాలని ఎమ్మెల్యే బత్తుల పిలుపునిచ్చారు..

# టిడిపి మండలఅధ్యక్షులుతో పెన్.పవర్.ఇంటర్వ్యూ

**టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్,**



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.21**తెలుగుదేశం పార్టీ కోసం అధికారంలోకి రావడానికి రాత్రి పగలు తేడాలేకుండా పనిచేశానని,చేస్తూనే ఉంటానని తెలుగుదేశం పార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్, కుమార్,స్పష్టం చేశారు.మంగళవారం పెన్ పవర్.మీడి యాతో కొన్ని అనుభవాలు పంచుకున్నారు.ప్రశ్న-సుదీ ర్ఘంగా సంత్సరంఆరునెలలోఅనంతరం వరరామచంద్రా పురం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా ఎన్నిక య్యారు.లాంఛనమే అయినా మెజారిటీ ఓటింగ్,తోహ్యా ట్రిక్,విజయంసాధించి,నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.ముందుగా మా పెన్.పవర్.దినపత్రిక తరుపున శు భాకాంక్షలు,అధ్యక్షులుగా మీ ప్రయాణం గురించి కొన్ని విషయాలు?జవాబు-ముందుగా ఊహించిందే అయినా పోటీలో తెలుగుదేశం పార్టీ సభ్యులు అద్భుతంగా ఓటింగ్ వేశారు.అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధి దిశగాఅడుగులు వేస్తాను. అందరికీ అందుబాటులోఉండి సహాయసహకారాలు అందిస్తానని,మీడియాముఖంగా వివరించారు.ప్రశ్న-మన వరరామచంద్రాపురం,మండలంలో పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులసమస్యలు,పరిస్థితిపై అధ్యక్షులుగా మీభాధ్యత పైమీ అభిప్రాయం జవాబు వరరామచంద్రాపు రంమండల ప్రజలు ఎదుర్కొనే ప్రదానసమస్య పోలవరం అందరి ఆశయాలకు అనుగుణంగా ముందుగా పోలవరం నిర్వాసితుల సమస్యలుఅధిష్టానం దృష్టికి తీసుకువెళ్తా నని,అందరికీ న్యాయంచేసే సందర్భంలో ప్రతీ ఒక్కరికీ న్యాయం దిశగాప్రయత్నం చేస్తానని చెప్పారు.ప్రశ్న-గోదా వరివరదలు ప్రజలఇబ్బందులు మీకు అన్నీ తెలిసిందే, సుమారు మూడునెలలుగా ప్రజలునానా బాధలు పడ్డారు. మీకు తెలిసిన విషయమే జవాబు-జిల్లా కలెక్టర్ తో అన్నీ సమస్యలు వివరించానని,త్వరలో ప్రతీ కుటుంబానికి వరదసహాయం తప్పకుండా అందుతుందని,శాసనసభ్య రాలు మిరియాలు శిరీషా భాస్కర్,మాట్లాడానని,స్పష్టం చేశారు.ప్రశ్న-రేఖపల్లి అంబేద్కర్ కాలనీ సమస్యలపై మీప్రతిస్పందన వివరించండి?జవాబు-రేఖపల్లి అంబేద్కర్ కాలనీ వాసులు సమస్యలు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లామని,త్వరలో తీపికబురువస్తుందని,ఈ ప్రయత్నంలో మిరియాల శిరీషా భాస్కర్,ఆధ్వర్యంలోఅన్నీ సవ్యంగాసా గుతున్నాయని,ఆశించిన ఫలితం వస్తుందని,వివరించారు ప్రశ్న- అన్నవరం వాగుపై వంతెన పనులు ఎప్పుడు ప్రారం భిస్తారో అర్థం కాని పరిస్థితి ఈ విషయంపై క్లారిటీ ఏంటీ?జవాబు-మంచి ప్రశ్న వేశారు.వంతెన నిర్మాణం తప్పకుం డాతెలుగుదేశం ప్రభుత్వం చేస్తుంది.కొద్దిగా వర్షాలుతగ్గిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయి.డైవర్షన్ రహదారి నిర్మాణంకూడా త్వరలో పరిష్కారంఅవుతుంది.ప్రశ్న-మం డలంలో అంతర్గత రహదారుల,పరిస్థితి పై మెయిన్,రహ దారిలోడ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లుపై నీటి నిల్వలు ఉండి, రహదారులు బాగా దెబ్బతిన్నాయని,వాటిపై కొన్ని విష యాలు ప్రజల కోసం?జవాబు-మండలంలో అంతర్గత రోడ్లు,మెయిన్ రోడ్లపై డ్రైనేజీ తదితర అంశాలపై పార్టీ ప్రజాప్రతినిధులతో నాయకులతో చర్చించి,అందరి సహా కారంతో అధిష్టానం దృష్టికి,మనశాసన సభ్యురాలు మిరియాలు శిరీషా భాస్కర్,దృష్టిలో పెట్టి డ్రైనేజీ వ్యవస్థ కోసం శాయశక్తులా ప్రయత్నం చేస్తానని,చెప్పారు.ప్రశ్న-గత 3 నెలలుగా వ్యవసాయభూములు గోదావరి ముంపులోనే ఉన్నాయని,వ్యవసాయానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని,అధ్యక్షులుగా ముంపునకుగురైన భూములపై మీఅభిప్రాయం?జవాబు-అన్నీ విషయాలు అందరంకూర్చోని పార్టీనియమాలకు అనుగుణంగా కలిసి నిర్ణయం తీసుకుంటామని,ఈ సమస్యలు మంత్రులు,లోకేష్ బాబు,నిమ్మల రామా నాయుడు,శాసన సభ్యురాలు శిరీషా భాస్కర్,దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం దిశగా ప్రయత్నం చేస్తామ న్నారు. ప్రశ్న-విద్యావ్యవస్థ,ఆరోగ్య సమస్యలపై ముఖ్యం గా మహిళలుకోసం వరరామచంద్రాపురం,మండల రేఖప ల్లి పి.హెచ్.సి.లో మహిళా గైనికాలిస్టు డాక్టర్,ను ఏర్పాటు చేస్తే అందరికి బాగుంటుందని,మీదృష్టికి తీసుకువస్తున్నా?జవాబు-శాసన సభ్యురాలు మిరియాల శిరీషా భాస్కర్, దృష్టిలో విషయాన్ని వివరించి,చెప్పితప్పకుండా మహిళా గైనికాలిస్టు ఏర్పాటు కోసం తప్పనిసరి ప్రయత్నం చేస్తాన ని మీఅందరి సహాయసహకారాలు అందించాలని,అలాగే నిరుద్యోగ యువత సమస్యల పరిస్కారం కోసం శాసన సభ్యురాలు మిరియాల శిరీషా భాస్కర్,తో మాట్లాడి జిల్లా కలెక్టర్,తో మాట్లాడి జాబ్ మేళా ఏర్పాటుకునాశక్తి మేరకు ప్రయత్నం చేస్తానని,విద్యా అభివృద్ధికి విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు అద్భుతమైన పథకాలు,డిఎస్సీ,ఇంకా తల్లి కి వందనం,తదితర పథకాలతో ముందుకు వెళ్తున్నారని వివరించారు.చివరిగా రాబోవు పంచాయతీ ఎన్నికల్లో చిన్నాపెద్దా తేడాలేకుండా అందరినీ కలుపుకొని కూటమి తరపున,ఎవ్వరూ ఊహించని రీతిలో గ్రామ పంచాయితీ లు కైవసం చేసుకొనిసత్తా చాటుతామని,కూటమి ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధి,కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షే మం,దృష్టిలో పెట్టుకొని ప్రచారంలో ముందుకు వెళ్తామని, అన్నీ సమిష్టి నిర్ణయాలు,సమిష్టిగాపనులు,సమిష్టివిజ యాలు,చూస్తామని చెప్పారు.ప్రజలు తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు,నాయకులు చిన్నా పెద్దా తేడా లేకుండా,అందరం కలిసికట్టుగా పార్టీకోసం తప్పనిసరి పనిచేసి మెజారిటీ స్థానాలుకూటమి కైవసం చేసుకుం టుందని,దీమావ్యక్తం చేశారు.అన్నీ సమిష్టి విజయాలు సమిష్టి నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు.(ముగిస్తూ మళ్లీ కొన్ని విషయాలతో కలుద్దాం వచ్చేసంచికలో

# ప్రధానమంత్రి బీమా పథకాలలో అడ్డతీగల యూనియన్ బ్యాంక్ దేశంలోనే ప్రథమస్థానం..





**అడ్డతీగల,పెన్ పవర్,అక్టోబర్ 21:**
దేశవ్యాప్తంగా ఉన్న 8,700 యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లలో అడ్డతీగల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ అత్యుత్తమగా భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. వివరాల్లోకి వెళితే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ,ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల అమలులో అగ్రగామిగా నిలవడంపై స్థానికులు, వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.బ్రాంచ్ మేనేజర్ బి.ఎస్.హెచ్. ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో 1,176 మంది, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో 1,544 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకాలపై మరింత అవగాహన పెంచి, ప్రతి ఖాతాదారుడికి ఈ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యం అని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన

436 రూపాయలు వార్షిక ప్రీమియంతో ఈ పథకాన్ని పొందవచ్చు. ఈ పథకంలో సభ్యుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి 2 లక్షల బీమా పరిహారం లభిస్తుంది అని బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. ఈ పథకం 18 నుండి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులకు వర్తిస్తుంది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కేవలం 20 రూపాయలవార్షిక ప్రీమియంతో ఈ పథకాన్ని పొందవచ్చు. యాక్సిడెంట్ కారణంగా మరణించిన లేదా పాక్షిక వికలాంగత కలిగిన 2 లక్షల వరకు బీమా ప్రయోజనం లభిస్తుంది. బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ ఖాతాదారులకు వివరిస్తూ,ఈ పథకాలు గ్రామీణ ప్రజలకు పెద్ద స్థాయి భరోసా ఇస్తుందని,తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించే ఈ పథకాలను, ప్రతి కుటుంబం తప్పక వినియోగించుకోవాలి అని అన్నారు.

ఈ పథకాల అమలులో మువ్మిడి భరత్ కుమార్ అత్యధిక సంఖ్యలో పాలసీలు చేయడం ద్వారా విశేషంగా కృషి చేశారనిమేనేజర్ అభినందించారు.ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బి.జి.ఆర్. నాయుడు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సునీత ప్రుస్టీ , ఫైనాన్షియల్ ఇంక్లూజన్ నోడల్ అధికారి అన్నం. శ్రీనివాస్, అడ్డతీగల బ్రాంచ్‌కి వచ్చి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండి %డ% సీఈవో ఆశిష్ పాండే మార్గదర్శకత్వంలో నిర్వహించబడింది అని బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సమీర్ రంజాన్, ఫీల్డ్ ఆఫీసర్ అభినవ్, మణిదీప్, సునీత, విజయలక్ష్మి, మరియు బ్యాంక్ సిబ్బంది ఖాతాదారులు, బీసీ పాయింట్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విడుదల చేసిన -అందని స్కూల్ గ్రాంట్లు

**వై రామవరం పెన్ పవర్ అక్టోబర్ 21:** ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలకు గ్రాంట్లు ప్రభుత్వం మంజూరు చేసిన నేటికీ అందలేదని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మెగా పేరెంట్స్ మీటింగ్ కు ముందుగానే ఆయా పాఠశాలలకు స్కూల్ గ్రాంట్లు విడుదల చేసినట్లు తెలిసింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల స్ట్రెంత్ ను బట్టి కాంపోనెంట్ గ్రాంటుగా సగం నగదు విడుదల చేసినట్లు తెలిసింది. సంబంధిత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పిఏఫ్ ఎంఎస్ ఎకౌంటు ద్వారా వెండర్ కు నగదు బదిలీ అవుతుందని తెలిసింది. నెలలు గడుస్తున్నా నేటికీ ఉపాధ్యాయులకు స్కూలు గ్రాంట్లు అందలేదని అనడం విశేషం. వెండర్ గా సరుకు సరఫరా చేసిన ఏ వ్యక్తినైనా పెట్టవచ్చని, అతని అకౌంట్లోనే నగదు జమ అవుతుందని అంటున్నారు. టర్మ్ రెండవ దఫా శిక్షణా కార్యక్రమం కు వచ్చిన ఏ ఎస్ ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి, స్కూల్ గ్రాంట్ల విషయమై ఉపాధ్యాయులను అడిగినట్లు తెలిసింది. స్కూల్ గ్రాంట్ల విషయమై పనసల పాలెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడును అడుగగా అందలేదని సమాధానం ఇచ్చారు. మండలంలో ఏ ఒక్క పాఠశాలకు స్కూల్ గ్రాంట్లు విడుదల కాలేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ విషయమై వై రామవరం ఎంఈఓ 1 కే. తాత బ్బాయి దొరను వివరణ కోరగా 80 శాతం ఆన్లైన్ పని పూర్తి అయినాయని అనడం విశేషం.



# బాధితులకు ఆర్థిక సాయం అందించాలి.



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 21**ఇటివల మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కొమరిపాలెం బాణాసంచా తయారీ పేలుడు ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎటువంటి పరిహారం చెల్లించకపోవడం దారుణం అని %వీ=ూా% రాష్ట్ర సీనియర్ నాయకులు దూళి జయరాజు అంగర గ్రామ సర్పంచ్ లు అసహనం వ్యక్తం చేశారు. మండలం లోని అంగర గ్రామ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం వారు ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు50 లక్షలు పరిహారం చెల్లించాలని అలాగే ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పించాలని జయరాజు డిమెండ్ చేశారు. ఈ విషయం పై ప్రభుత్వం స్పందించక పోతే కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇంటి ముందు వామ పక్షల నేతలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు

# రాష్ట్రంలో కుల రాజకీయాలు చేస్తున్న వైసీపీ

- గత ప్రభుత్వంలో హత్యలు, దారుణాలు
- జరిగితే జగన్ ఏమయ్యారు ?
- జనసేన నేత పవన్ కళ్యాణ్ జోలికొస్తే
- సహించేది లేదు
- మీడియా సమావేశంలో
- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- జనసేన జిల్లా అధ్యక్షుడు వైస్ శ్రీనివాసు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:** రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వైసిపి పార్టీ నేతలు కుల రాజకీయాలు చేస్తున్నారని రాజానగరం నియోజవర్గం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో జరిగే ప్రతి సంఘటనను జనసేన నేత పవన్ కళ్యాణ్ కు వైసీపీ ముడిపెడ్తోందని, వైసిపి వారు ఆయన జోలికి వస్తే సహించేది లేదని బత్తుల హెచ్చరించారు. స్థానిక స్వగృహంలో మంగళవారం ఆయన జనసేన జిల్లా అధ్యక్షుడు వై శ్రీనివాస్ తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ , నెల్లూరు జిల్లా, కందుకూరు గ్రామంలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్య ను వైసీపీ నేతలు కుల రాజకీయాలు చేసి ప్రజల్లో అశాంతిని రేపుతున్నారని మండిపడ్డారు. ఈ సంఘటనతో ఎలాంటి సంబంధం లేని జనసేన నేత పవన్ కళ్యాణ్ ను మొదటి ముద్దాయిగా పేర్కొనడం వెనుక రాజకీయల లబ్ధి కోసం వైసిపి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు నియంత్రణలో ఉన్నాయని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం పథకాలు అందుతున్నాయని , మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండడం వైసిపి అధినేత జగన్ కు, ఆ పార్టీ నాయకులు సహించలేక పోతున్నారని , దాంతో కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు సంఘటన ను ఖండిస్తున్నామని, రాష్ట్ర మంత్రులు, కూటమి నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారని ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సహాయ ,సహకారాలు అందిస్తామని మనోధైర్యం కల్పించారని బత్తుల గుర్తు చేశారు. వైసీపీ నాయకులు బాదిత కుటుంబాన్ని పరామర్శించడం , సానుభూతితో సహాయం చేయడం లో తమకు అభ్యంతరం లేదని, అయితే బాధితులను అడ్డం పెట్టుకొని వైసిపి స్వార్థ రాజకీయాలు చేస్తే జనసేన చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అన్ని పార్టీల్లోని కాపుల మధ్య చిచ్చు పెట్టాలని జగన్ కుతంత్రాలు పన్ను తున్నారని కాపుల ఐక్యత ను దెబ్బతీయడం ఎవరి తరం కాదన్నారు. గత ప్రభుత్వంలో ఇంతకన్నా దారుణ హత్యలు, దళితుల హత్యలు , రైతుల ఆత్మహత్యలు జరగాయని అప్పుడు జగన్ ఏమయ్యారని బత్తుల ప్రశ్నించారు. తాడేపల్లి ,బెంగళూరు ప్యాలస్ లు విడిచి జగన్ రాలేదని , రాష్ట్రంలో ప్రతిపక్షం బాధ్యత ఇవ్వకుండా ప్రజలు 11 స్థానాలకే ఇంట్లో కూర్చోబెట్టిన సంగతిని గుర్తు చేసుకోవాలన్నారు. గత ఐదేళ్ల వైసిపి హయ్యాంలో ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు పోలవరం ప్రాజెక్టులో ఒక మట్టి తట్ట వేయలేదని ఎప్పుడు సంబరాలు చేసుకుంటునే గడిపేవాడని ఎద్దేవా చేసారు. రాజనగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కాపు కార్పొరేషన్ చైర్మన్ గా కాపుల సంక్షేమానికి ఉపయోగపడే రుణాలు, విదేశీ విద్య ప్రోత్సహించిన దాఖలాలు లేవని, పి గన్నవరంలో ప్రజా సమస్యల పై మాట్లాడిన జనసేన వీర మహిళలను అసభ్యంగా మాట్లాడిన చరిత్ర, దళితుడి ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తితో ఊరేగిన చరిత్ర జక్కంపూడి దని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ తో సహా జగన్ వర్గీయులు కుట్ర, కుల రాజకీయాలను ఇదే విధంగా చేస్తే మరో 10 ఏళ్ళు అయినా రాష్ట్రంలో వారికి అందలం ఎక్కరన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు వై. శ్రీనివాసు మాట్లాడుతూ, కందుకూరు కందుకూరులో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగిందని దాన్ని వైసిపి కులాలతో ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని వైసిపి నేత జగన్, అతని వర్గీయులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సంఘటనను రాష్ట్ర ప్రజల్లో తప్పుదోవ పట్టించేందుకు సంబరాల రాంబాబు, జక్కంపూడి రాజా, నరేంద్ర లు కుల రాజకీయాలు చేస్తే జనసేన చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

## అన్నదానంకు మించిన దానం మరేది లేదు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21,** అన్నదానంకు మించిన దానం లేదని, ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టే వారే నిజమైన సమాజ ప్రేమికులని పలువురు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ ఐటి ప్రాజెక్ట్ అడ్వైజర్ పెన్నమరెడ్డి నాగబాబు జన్మదినం ను పురస్కరించుకొని ఆయన బంధువులు,అభిమానులు అంబాజీపేటలో పుట్టినరోజు కేకును కట్ చేసి నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమలాపురం రూరల్ మండలం బండారులంక షిరిడి సాయిబాబా ఆలయం సమీపంలోని నిత్య అన్నదాన సత్రంలో జన సైనికుడు మైపాల తాతాజీ ఆధ్వర్యంలో బీదలకు అన్నదానం చేశారు. అన్నదాన సత్రం నిర్వాహకులు,ప్రముఖ సిద్ధాంతి కాలెపు భీమేశ్వరరావు మాట్లాడుతూ అన్నదానంకు మించిన దానం లేదని, మానవులతో పాటు ఏ జీవినైనా కడుపు నింపే తృప్తి పర్చగలమన్నారు. పేదలకు, బీదలకు, వృద్ధులకు అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల బాబి, రవణం రాము, వర్రె శేషు,కామిశెట్టి పండు,మంచాల సతీష్, మేడిది శ్రీను,సూదాబత్తుల రవి, వాకపల్లి నాగబాబు, బందన రంగ, రవణం విజయ్, నందెపు శ్రీను తదితరులు ఉన్నారు.

## శాలివహన అందరూ ఐక్యతో ఉండాలి

- అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21**

శాలివాహన సంఘియులంతా ఐక్య తో ఉండాలని అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం అన్నారు.

శాలివాహన సంక్షేమ సంఘం సమావేశము మాచవరం సంఘ భవనం నందు కార్యదర్శి దాలపర్తి భీమేశ్వరావు అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సమావేశం లో అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం హాజరై మాట్లాడుతూ శాలివాహన సంఘీయులంతా ఐక్యతతో మెలగాలని మన సంఘ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. శాలివాహన సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని అన్నారు. వన సమారాధన ఈనెల 16 తేదీన ఆదివారము జరుపుటకు సంఘము నిర్ణయము తీసుకున్నది. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు వెల్లా త్రిమూర్తులు, సంఘ సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ యువజన నాయకుడు పాలకొల్లు వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ మంతెన శ్రీనివాస్, అయినవిల్లి మండల అధ్యక్షులు తాడినాటి ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి యెడిద రమేష్, అమలాపురం మండల అధ్యక్షులు కోటిపల్లి సత్యనారాయణ, అల్లవరం మండల అధ్యక్షులు బట్టిలంక వీర వెంకట సత్యనారాయణ, దేవగుప్తాపు నాగేంద్ర, ఠానేలంక శ్రీనివాస్, టీ వెంకటేశ్వరరావు, ఆదుర్తి ఓం నమశ్శివాయ, చిరత పూడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట మండల అధ్యక్షులు రాయపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ ర్యాలీ భాస్కర్, సూరిబాబు పసలపూడి శ్రీనివాస్, ఆదుర్తి నారాయణ మూర్తి, సంఘ నాయకులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపరచుకోండి - డాక్టర్ ఆశిష్



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21:** ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచు కోవాలని అమలాపురం ఏఎస్ఏ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.శివ.ఆశిష్ కోరారు.

మంగళవారం అంబాజీపేట మండలం మాచవరం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ఉచితంగా ఏర్పాటుచేసే వైద్య శిబిరాల్లో తమ ఆరోగ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించు కోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యవంతులుగా మెలగాలని డాక్టర్ ఆశిష్ పేర్కొన్నారు. సేవా పరంగానే ఖరీదైన వైద్యాన్ని నిరుపేదలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎం.శివ ఆశిష్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మరియు షుగర్ వైద్య నిపుణురాలు డాక్టర్ గుండా బత్తుల అంజలి పలువు షుగర్ రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు.అనంతరం ఆర్థోపెడిక్, కీళ్ళ వ్యాధినిపుణులు డాక్టర్ సిహెచ్. సురేష్, శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నర్రా శ్రీనివాసులు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ మత్తే అనూష, మానసిక వైద్య నిపుణురాలు పసుపులేటి సౌమ్య లు రోగులకు పలు చికిత్సలు నిర్వహించారు. ,ఊపిరితిత్తులు, గుండె కీళ్లు,నరాలు, తదితర సమస్యలతో బాధపడుతున్న రోగులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాచవరం గ్రామస్తులు మాట్లాడుతూ ఏఎస్ఏ హాస్పిటల్లో ఎంతో పేరుగాంచిన వైద్యులు తమ గ్రామంకు వచ్చి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తమ అనారోగ్య సమస్యలను, దీర్ఘకాలిక రోగాలను నయం చేసేందుకు ముందుకు వచ్చిన వైద్యులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది రోగులు బారులు తీరు మరి వైద్య శిబిరం వద్ద కు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ జయశ్రీ ఏ ఎస్ కే హాస్పిటల్ పిఆర్ఓ రాయుడు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం ధనలక్ష్మి, నాగేంద్ర సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి - ఎమ్మెల్యే బండారు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని దేవాదాయ కమిషనర్‌కు విజ్ఞప్తి





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 21 :** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్‌ను కోరారు.

మంగళవారం విజయవాడ గొల్లపూడిలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతులు, వసతి గృహాలు, రహదారి సదుపాయాలు, పార్కింగ్ ప్రదేశాలు, శ్రీవారి దర్శనానికి క్యూలైన్ కాంప్లెక్స్ వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి వారాంతంలో వేలాదిమంది భక్తులు, ముఖ్యంగా శనివారాల్లో వివిధ రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించడం అత్యవసరం. అందుకే అనుమతులు తక్షణం మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరాను," అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ ఆలయ అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.

## వీరరాఘవులను పరామర్శించిన కూటమి నేతలు



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 21 :** మండలంలోని వెదుళ్ళకుంట గ్రామానికి చెందిన బిజెపి నాయకులు బొడ్డు వీరరాఘవులు పితృమూర్తి రామకృష్ణ పరమహంస అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి కూటమి నాయకులతో కలిసి రాఘవులు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనారోగ్యానికి గురైన కారణాలను కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము,గోపాలపురం సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేష్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గెల్లా శ్రీనుబాబు,జొన్నలగడ్డ ప్రసాద్,జ్యేష్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు విధిగా తనిఖీ చేయాలి

హుకుంపేట పంచాయితీ డి.బ్లాక్ లో సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:** గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు విధిగా తనిఖీ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం హుకుంపేట పంచాయితీ డీ.బ్లాక్ నందు నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను, పారిశుద్ధ్య పనులను పరిశీలించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రూరల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించమన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు ఆక్రమణలు తొలగించడం సహజమని, డ్రైనేజీ నిర్మాణ పనులు జాప్యం అవుతాయని వివరించారు. నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా మురుగునీరు బయటకు మురుగునీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక మహిళలు గోరంట్లకు చెప్పారు మురుగునీరు బయటకు పోయేందుకు సహకరించాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో మొత్తం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి డ్రైనేజీ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని సర్వే చేసి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. .

అనంతరం సాటిలైట్ సిటీ సి.బ్లాక్ నందు కళ్యాణ మండపం నిర్మాణ పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి.ఇ రవికుమార్, ఏ.ఈ సంపత్ కుమార్, వాసిరెడ్డి బాబి, పెండ్యాల రామకృష్ణ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, సోమేశ్వరరావు, హీరా సింగ్, చామాంద్రి నాని, ఏఎంసీ డైరెక్టర్ బైరెత్తి సరోజినీ, నిచ్చినకోళ్ల సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, దారా అన్నవరం, పెంకే కోటేశ్వరరావు, బండారు సత్తిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ కాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 21:** జగంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మను పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే ఆయన్ను తుమ్మలపల్లి రమేష్ స్ఫూర్తిగా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' దీపావళి ప్రత్యేక ప్రోమో

### సంక్రాంతికి వినోదాల విందుని హామీ ఇస్తున్న ప్రోమో

### త్వరలో 'అనగనగా ఒక రాజు' మొదటి గీతం విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** తనదైన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి దీపావళి ప్రత్యేక ప్రోమో విడుదలైంది. నవ్వుల టపాసులను తలపిస్తున్న ఈ ప్రోమో, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు నవ్వులతో నిండిన అసలైన పండుగకు హామీ ఇచ్చేలా ఈ ప్రోమో ఉంది.
నవీన్ యొక్క అద్భుతమైన హాస్య చతురత, అప్రయత్నమైన ఆకర్షణ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు కట్టిపడేసింది. ఈ దీపావళి ప్రోమో వినోదాల విందులా ఉంది. నవీన్ పొలిశెట్టి శైలి హాస్యాన్ని ప్రేక్షకులు ఎందుకు అంతలా ఇష్టపడతారో ఈ ప్రోమో మరోసారి గుర్తుచేసింది. రెండు నిమిషాల ఇరవై ఎనిమిది సెకన్ల నిడివితో రూపొందిన ఈ దీపావళి ప్రోమో, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అతి కొద్దిమంది మాత్రమే నిమిషంలో ఇంతటి వినోదాన్ని పంచగలరు. అభిమానులు దీనిని "ఒక నవ్వుల అల్లరి", "వినోదాల విందు", "అసలైన పండుగ సినిమా" అని పిలుస్తున్నారు. హాస్యం, తాజాదనంతో నిండి, ప్రేక్షకులను మెప్పించే కథలను ఎంచుకోవడంలో నవీన్ మరోసారి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు.ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ.. ఈ భారీ అంచనాలున్న చిత్రం నుండి మొదటి గీతం త్వరలో విడుదల కానుంది.శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. నవీన్ పోలిశెట్టితో కలిసి ఆమె సరికొత్త వినోదాన్ని పంచనున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి, జె యువరాజ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న 'అనగనగా ఒక రాజు'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన దీపావళి ప్రోమో, ఆ అంచనాలను రెట్టింపు చేసింది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా 'అనగనగ ఒక రాజు' చిత్రాన్ని నిలిపింది.సరదాల పండుగ మొదలవుతుంది. దీపావళి ప్రోమో ఆకట్టుకుంది. మొదటి గీతం రాబోతుంది. 'అనగనగా ఒక రాజు' ఈ సంక్రాంతిని గుర్తుండిపోయేలా చేయడానికి సిద్ధమవుతోంది.చిత్రం: అనగనగా ఒక రాజుతారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

## ఎమ్మెల్యేను బెదిరించి కోటి రూపాయలు

**గుంటూరు, అక్టోబరు 21, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా రోజురోజుకూ డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోతున్నాయి. సామాన్యులనే కాదు.. ప్రజాప్రతినిధులను కూడా కేటుగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా.. ఏపీలోని ఓ ఎమ్మెల్యేను బెదిరించి అతని నుంచి కేటుగాళ్లు కోటి రూపాయలు కొట్టేశారు. అసలు విషయం తెలుసుకున్న సదరు ఎమ్మెల్యే.. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకిదిగి విచారణ చేస్తున్నారు.ఏపీకి చెందిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని నివాసంలో ఉండగా.. ఈ నెల 10వ తేదీన ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారి గౌరవ్ శుక్లాగా పరిచయం చేసుకున్నాడు. ఎమ్మెల్యే బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించాడు. ఆ తరువాత కొద్దిసేపటికి మరో నెంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. యూనిఫాంలో ఉన్న ఆ వ్యక్తి ముంబై సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారి విక్రమ్‌గా పరిచయం చేసుకున్నాడు.ఉగ్రవాదుల బ్యాంకు లావాదేవీల కేసులో మీకు ప్రమేయం ఉంది.. మనీ లాండరింగ్ జరిగిందని పేర్కొంటూ.. ఒక ఉగ్రవాది ఖాతా నుంచి రూ.3కోట్లు మీ బ్యాంక్ ఖాతాకు బదిలీ అయ్యాయంటూ నకిలీ పత్రాలు, అరెస్టు వారెంట్లు చూపించి బెదిరించాడు. అంతేకాదు.. మీ బ్యాంక్ అకౌంట్లు పరిశీలించాలి.. అందుకు సహకరించాలి.. ఏ క్షణమైనా అరెస్టు చేస్తామంటూ భయపెట్టాడు. ఈ క్రమంలో పలు దఫాలుగా ఎమ్మెల్యే నుంచి రూ.1.07కోట్లు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు.మళ్లీ కొద్దిగంటల తరువాత మరో రూ.60లక్షలు ఇవ్వాలి అంటూ డిమాండ్ చేశాడు. దీంతో మోసపోయినట్లుగా గుర్తించిన ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్.. వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లో జరిగిన విషయాన్ని వివరించి ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు విచారణ చేస్తున్నారు. హరియాణా, ఉత్తరప్రదేశ్ సైబర్ గ్యాంగ్ చేతివాటంగా పోలీసులు గుర్తించారు. సైబర్ కేటుగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

## స్టేట్స్ లో ట్వీట్స్ వార్...

**విశాఖపట్టణం, అక్టోబరు 21, పెన్ పవర్:** స్టేట్స్ అండ్ ట్వీట్స్ వార్ నడుస్తూనే ఉంది. ఏపీ, కర్ణాటక మినిస్టర్స్ మధ్య ఇన్వెస్ట్‌మెంట్స్‌పే డైలాగ్ వార్ కొనసాగుతోంది. బెంగళూరులో రోడ్లు బాలేవు..సౌకర్యాలు కల్పించడం లేదని కంపెనీల సీఈవోలు పెట్టిన పోస్టులతో వివాదం మొదలై..లోకేశ్ రెస్పాండ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ చేసిన ట్వీట్‌కు లోకేశ్ అదే స్థాయిలో రియాక్ట్ కావడం ఆసక్తికరంగా మారింది. కర్ణాటక మంత్రులు%ొ%ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. బెంగళూరులో పరిశ్రమలను రన్ చేయలేకపోతున్నామని..అక్కడి నుంచి వెళ్లిపోతామంటూ పలువురు ఇండస్ట్రియలిస్టులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఆ మధ్య చర్చకు దారితీసింది. ఇదే అదునుగా..ఏపీకి వచ్చేయండి..మీకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ అంటూ లోకేశ్ చేసిన ట్వీట్స్ ఆసక్తికరంగా మారాయి. బెంగళూరులో రోడ్లు, ఇతర సౌకర్యాలు, వసతులపై ఏరో స్పేస్ పార్క్, బ్లాక్ బక్ అనే పరిశ్రమ అసంతృప్తిపై గతంలోనే లోకేశ్ రియాక్ట్ అయ్యారు.ఏరో స్పేస్ పార్క్‌ను అనంతపురంకు..బ్లాక్ బక్ పరిశ్రమలను విశాఖపట్నానికి తరలించాలని కోరారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో కాక రేగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయని అక్కడి విపక్షాలు సిద్దరామయ్య సర్కార్‌పై అటాక్ స్టార్ట్ చేయడంతో..15 రోజుల క్రితం పెద్ద రచ్చే అయింది. అప్పటినుంచే ఏపీ, కర్ణాటక మంత్రుల మధ్య ట్వీట్ వార్ మొదలై..ఈ మధ్య కాస్త చల్లబడిందిఇప్పుడు గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ ప్రియాంక్ ఖర్గే చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా రాయితీలు ఇచ్చి గూగుల్ డేటా సెంటర్‌ను ఏపీకి తెచ్చుకుందన్నారాయన. అన్ని రాయితీలు ఇస్తే ఏ రాష్ట్రం అయినా పెట్టుబడులు తెచ్చుకోవచ్చన్నారు. అంతేకాదు ఏపీ అప్పులు ఇప్పుడు దాదాపు రూ.10 లక్షల కోట్లకు పెరిగాయని, కేవలం ఒక సంవత్సరంలోనే రూ.లక్షా 61 వేల కోట్లకుపైగా అప్పులు తీసుకున్నారని కూడా ప్రియాంక్ ఖర్గే ట్వీట్ చేశారు.ఆంధ్రా ఫుడ్ స్పైసీగా ఉంటుందని..ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో కాస్తంత ఘాటు ఉన్నా.. దాన్ని ఆస్వాదిస్తారు. కానీ పోషకాహార నిపుణులు ఆహారంలో సమతుల్యత ఉండాలని సిఫార్సు చేస్తున్నారు. అలాగే ఆర్థికవేత్తలు కూడా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్‌ను మెయింటేన్ చేయాలని చెబుతున్నారంటూ ప్రియాంక్ ఖర్గే తన ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్..ప్రియాంక్ ఖర్గేకు కౌంటర్ ఇచ్చారు. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడంపై పొరుగు రాష్ట్రాల్లో అలజడి మొదలైందన్నారు. ఆంధ్రా ఆహారం కారంగా ఉంటుందని అంటున్నారని, తమ పెట్టుబడులు కూడా అలాగే అనిపిస్తున్నాయని చురకలు అంటించారు. పొరుగువారికి ఇప్పటికే ఆంధ్రా కారం ఘాటు సెగ తగులుతుందని లోకేశ్ ఇచ్చి పడేశారు.ఈ ట్వీట్ వార్ లో ఏపీ ఐటీ మినిస్టర్ చుట్టూ చర్చ జరుగుతోంది. ఏపీకి ఇన్వెస్ట్‌మెంట్స్ తేవడంలో లోకేశ్ కీరోల్ ప్లే చేస్తున్నట్లుగా ఆయనకు హైప్ క్రియేట్ అవుతోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇద్దరిలో ఎవరూ కూడా కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌పై రియాక్ట్ కావడం లేదు. ప్రియాంక్ ఖర్గే అయినా..డీకే శివకుమార్ వ్యాఖ్యలు చేసినా..లోకేశే వారికి కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ ఐటీ మినిస్టర్‌గా లోకేశ్ పెట్టుబడులు తెస్తుంటే..కర్ణాటక మంత్రులు అడ్డుకుంటున్నారని..జనాల్లో చర్చ జరుగుతోంది.గూగుల్ డేటా సెంటర్ అగ్రిమెంట్ నుంచి..ఇటు ఏపీలో విపక్ష వైసీపీ విమర్శల దాక..అటు కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌తో లోకేశ్ సెంట్రిక్‌గా డిస్కషన్ నడుస్తోంది. అటు ఐటీ ఫీల్డ్‌లోనూ..ఇటు ఏపీ పబ్లిక్‌లోనూ..నేషనల్ మీడియాలోనూ లోకేశ్ ట్వీట్స్‌పై డిస్కషన్ నడుస్తోంది. గూగుల్ డేటా సెంటర్ రాక సందర్భంగా ఎంతగా ప్రచారం చేసుకోవాలో అంతకంటే ఎక్కువే మైలేజ్ పొందే ప్రయత్నం చేస్తోంది కూటమి. పైగా బెంగళూరులో రోడ్లు, సౌకర్యాలు, వసతుల సరిగ్గా లేవని కంపెనీల సీఈవోలు చేస్తున్న ట్వీట్లను లోకేశ్ ప్లస్ పాయింట్‌గా మార్చుకోవడంతో..ఓవరాల్ ఎపిసోడ్‌లో ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ హైలెట్ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. కర్ణాటక మంత్రులు, ఏపీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్‌కు ఎండ్ కార్డ్ పడేదెప్పుడో చూడాలి.

## పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం

**విజయవాడ, అక్టోబరు 21, పెన్ పవర్:**
జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం ఉందంటున్నారు. పవన్ కళ్యాణ్ పదే పదే పదిహేనేళ్ల పాటు కూటమి కలసి ఉంటుందని చెబుతూ వస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి పవన్ కళ్యాణ్ పెట్టే షరతులు కూడా మారతాయంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే పవన్ కళ్యాణ్ గౌరవంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను ఇబ్బందిపెట్టే విధంగా మాట్లాడినా మిత్రధర్మం కోసం పవన్ కళ్యాణ్ సహిస్తూ కూటమి విచ్ఛిన్నం కాకపోవడానికి తానే కారణమని గట్టిగా చెప్పదలచుకున్నారు. ఇప్పటి వరకూ మిత్రపక్షాల్లో ఉన్న టీడీపీ నేతలు మాత్రమే జనసేన పై కొంత నోరు జారారుఅదేసమయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రం చాలా వరకూ సంయమనం పాటిస్తూ వస్తున్నారు. అందుకు దూరాలోచన కారణమన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మొన్నటి ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించిన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టగలిగారు. కీలకమైన పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖ వంటివాటిని ఏరికోరి తీసుకున్నారు. అంతేకాదు కొన్ని విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాలను కూడా మంత్రి మండలి సమావేశాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో అమరావతి రాజధాని రైతుల నుంచి అదనపు భూముల విషయంలో అభ్యంతరాలు తెలపడంతో పాటు ఇటీవల లూలూ సంస్థ పెట్టిన షరతులను కూడా ప్రశ్నించి తాను అవసరమైనపుడు ప్రశ్నిస్తానని సిగ్నల్స్ అధికార టీడీపీకి ఇవ్వగలిగారు.మరోవైపు 2024 ఎన్నికల వరకూ ఆయన ఎమ్మెల్యేగా కూడా ఎన్నిక కాలేదు. దీంతో అనుభవం లేకపోవడంతో సీట్ల పంపకంలో గాని, చివరకు మంత్రి పదవుల విషయంలోగాని ఒకింత రాజీ పడ్డారు. తాను తక్కువ సంఖ్యలో సీట్లు తీసుకున్నానని ఆయనకు తెలుసు. జనసైనికులకే కాదు తన అభిమానులకు కూడా అది నచ్చదని తెలిసినా చంద్రబాబు అనుభవానికి పెద్దపీట వేయాలని సహకరించారు. ఇకపై అలా ఉండదంటున్నారు. ఎందుకంటే ఉప ముఖ్యమంత్రిగా ఎటూ వచ్చే ఎన్నికల నాటికి ఐదేళ్ల అనుభవం ఉంటుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో షరతులు ఉంటాయన్నది జనసైనికుల నుంచి వినిపిస్తున్నమాట. అలాగే సీట్ల విషయంలోనూ రాజీ ఉండదన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతుంది. తనకు కూటమి కలసి ఉండటం ఎంత అవసరమో టీడీపీకి అంతకంటే ఎక్కువ అవసరం కావడంతో ఈరోజు షరతులు వర్తిస్తాయని జనసైనికులు బాహాటంగానే చెబుతున్నారు.

## యాక్టివ్ అయిన కేడర్

**విజయవాడ, అక్టోబరు 21, పెన్ పవర్:**
వైసీపీ అధినేత జగన్ పార్టీకి కేవలం పదహారు నెలల్లోనూ ఆంధ్రప్రదేశ్ లో కొంత ఊపు కనిపిస్తుందని ఆ పార్టీ నేతలు అంచనా వేసుకుంటున్నారు. అందుకే ఇన్నాళ్లూ బయటకు రాని వారు కూడా ఇప్పుడు వైసీపీకి వచ్చే క్రేజ్ ను చూసి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటి వరకూ వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారం వస్తుందో రాదో అన్న అనుమానంతో ఇంటి గడప దాటని నేతలు కూడా నేడు బయటకు వచ్చి అధికార పార్టీ పై విమర్శలు చేస్తున్నారు. జనం నాడి కొంత తెలియడంతో వారి మనసులు కూడా మారాయంటున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన పదిహేను నెలల నుంచి కనిపించని నేతలు నేడు బయటకు రావడంతో పాటు వైసీపీ ఇచ్చిన కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు.అదే సమయంలో మీడియా సమావేశాలు కూడా పెట్టి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ గుడివాడ అమర్ నాథ్, పేర్ని నాని, జోగి రమేష్, ఆర్కే రోజా, విడదల రజనీ, బొత్స సత్యనారాయణ వంటి నేతలు మాత్రమే మీడియాలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి ముందుండే వారు. కానీ దూరంగా ఉండే ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు కూడా బయటకు వస్తున్నారంటే పార్టీకి కొంత హైప్ కనపడుతుందన్న భావన నేతల్లో వ్యక్తమవుతుంది. కేవలం పదహారు నెలల్లోనే వైసీపీ నేతలు ఇంత యాక్టివ్ అయితే రానున్న కాలంలో మరింతగా బయటకు వచ్చి ప్రజల్లోకి వెళతారన్న అంచనాలో కేంద్ర పార్టీ కార్యాలయం కూడా ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా జగన్ పర్యటనలకు జనం నుంచి మంచి స్పందన రావడంతో పాటు క్యాడర్ కూడా భయం లేకుండా వచ్చి పాల్గొనడంతో ఈ మార్పునకు కారణమని అంటున్నారు. అనేక అంశాలు వైసీపీకి ప్లస్ గా మారాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధానంగా గుంటూరు మిర్చి రైతులు, పొదిలి పొగాకు రైతులు, బంగారుపాళ్యంలో చిత్తూరు మామిడి రైతుల కోసం వెళ్లిన పర్యటనతో పాటు పల్నాడు పర్యటన, తాజాగా ఉత్తరాంధ్ర పర్యటన కూడా సక్సెస్ కావడంతో ఒక్కొక్కరుగా నేతలు బయటకు వస్తున్నారు. దీంతో పాటు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశంతో పాటు కల్తీ మద్యం ఘటన కూడా తమకు అనుకూలంగా మారుతుందని అంచనా వేసుకుని మరీ నేతలు బయటకు వస్తున్నారని వైసీపీ కీలక నేత ఒకరు చెప్పారు. మొత్తం మీద రానున్న రోజుల్లో వైసీపీ నేతలు ఇక జనం బాట పట్టే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## పీడీఎస్ బియ్యం కనిపెట్టేలా మొబైల్ టెస్టింగ్ కిట్స్

**కాకినాడ, అక్టోబరు 21,పెన్ పవర్:**
పీడీఎస్ బియ్యం మాఫియా అనగానే కాకినాడ పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అంతటిస్థాయి వివాదం కాకినాడ చుట్టూ ముసురుకుంది.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ పద్ధతిలో సేకరించిన పేదల బియ్యాన్ని చివరకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి అక్రమ సొమ్మును ఆర్జిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికలకు ముందు నుంచి పెద్ద దుమారమే రేగింది.. ఈనేపథ్యంలోనే ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీడీఎస్ బియ్యం మాఫియా అంతుచూస్తామని కూడా వాగ్ధానాలు చేశారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం హెూదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటకు వచ్చి నేరుగా పోర్టుకు వెళ్లారు.. అక్కడ అక్రమంగా ఎగుమతి అవుతున్న పీడీఎస్ బియ్యం ను టన్నుల కొద్దీ గుర్తించి సీజ్ చేయించారు.. ఆతరువాత ఏపీ సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ కూడా మరో రెండు సార్లు కాకినాడ పోర్టులో విస్తృతంగా తనిఖీలుచేసి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం సీజ్ చేయించారు.. కానీ చాలా వరకు అవి పీడీఎస్ బియ్యం అని నిరూపించలేని పరస్థితి తెలెత్తింది.. ఇదిలా ఉంటే కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను అడ్డుకునేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించినప్పటికీ అవికూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి.. కానీ యధారాజా తథా ప్రజా అన్న చందంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అనే నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది..గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా జరిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది.. రేషన్ మాఫియాలో చాలా మంది పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి..ముఖ్యంగా తీర ప్రాంతాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, దీనికి అడ్డుకట్ట



వేయాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్తితి కనిపించింది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మంచి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లయ్యింది.. రేషన్ బియ్యం పట్టుకున్నా, అవి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం అని అనుమానాలున్నా పీడీఎస్ బియ్యం అని రూఢీ చేయడానికి టెస్ట్ చేయడానికి ల్యాబ్ కి పంపి వారం రోజులు వెయిట్ చేయాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం ఒక మొబైల్ కిట్‌ను రూపకల్పన చేయించి పంపిణీకు సిద్ధం చేసింది. మొబైల్ కిట్ లో ఉండే కెమికల్ బాటిల్స్ రేషన్ బియ్యం లో వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న ఫోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి. వెంటనే అది అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం అని అర్ధం క్లియర్‌కట్‌గా అర్ధం అవుతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 700 కిట్లు, 33 మంది అదనపు సిబ్బందిని విశాఖపట్నం లో 3 చెక్ పోస్ట్ ల దగ్గర నియమించారు. అలాగే కాకినాడ లో కూడా సుమారు 700 కిట్లు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను చాలా సులభంగా గుర్తించి కట్టడి చేయడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. పీడీఎస్ బియ్యంలో పోషక విలువలు పెంచేవిధంగా ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలను తగ్గించేందుకు ఈ ప్రక్రియను ప్రారంభించింది. వీటివల్ల ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లాంటిముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి.. ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతీ క్వింటాల్ సాధారణ బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్ కలుపుతున్నారు. 100 కిలోల బియ్యంలో అంటే ఒక శాతం వంతు ఫోర్టిఫైడ్ బియ్యం ఉంటుంది.. ఇప్పుడు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో పట్టించేందుకు ఈ ఫోర్టిఫైడ్ రైస్ ఉపయోగ పడుతున్నాయి..

## యానాం బీచ్ లో సంక్రాంతి సంబురాలు

**కాకినాడ, అక్టోబరు 21, పెన్ పవర్:**
సువిశాల సాగరతీరం.. తెలుపు వర్ణంలో ఆకట్టుకునే తీరంలోని ఇసుక తిన్నెలు.. కాసేపు తీరంలో గడిపితే మనసుకు, తనవుకు తాకుతూ అవధులు లేని ఉత్సాహాన్ని ఇచ్చే పిల్లతిమ్మెరలు.. అల్లంత దూరంలోనే పచ్చని తివాచీ నిలబెట్టిన చందంగా కనిపించే సరుగుడు తోటలు.. బీచ్ కు వెళ్లే ముందే రా రమ్మని ఆహ్వానం పలికే ఉప్పుటేరుల్లో బోట్ షికార్లు.. ఇక నోరూరించే ఘుమఘుమల పసందైన గోదావరి వంటకాలు.. ఇక సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింభించేలా ప్రత్యేక కార్యక్రమాలు.. జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు.. రాత్రి అయితే చాలు వినోద కార్యక్రమాలు.. ఇలా ఒక్కటేమిటి.. అన్ని హంగులతోనూ ఈ సారి సంక్రాంతి పండుగను అదిరిపోయే స్థాయిలో ప్లాన్‌చేస్తున్నారు. ఎక్కడ అనుకుంటున్నారా.. అదేనండీ ఆంధ్రా గోవా.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఉప్పలగుప్తం మండలం సూరసాన యానాం బీచ్‌లో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సంక్రాంతి పండుగ సంబరం బీచ్ ఫెస్టివల్‌గా ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు ఇంకా మూడు నెలల సమయం ఉంది. అయినా ముందస్తుగానే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సారథ్యంలో పక్కాగా మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు విడుదల చేయడంతోపాటు చమురు, సహజ వాయు సంస్థల సీఎస్సార్ నిధుల ద్వారా పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా యానాం బీచ్ లో అధికారులు పర్యటించి ప్రణాళిక సిద్ధం చేశారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు ఇక్కడికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో తరలివచ్చే అవకాశాలు ఉండడం వల్ల రోడ్లు అభివృద్ధి, పర్యాటకులు ఉండేందుకు రిసార్ట్స్‌లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, భద్రత, రవాణా సదుపాయం ఇలా అనేక అంశాలపై పరిశీలించి ముందస్తు ఏర్పాట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యానాం బీచ్ వరకు నేరుగా భారీ వాహనాలు సైతం వెళ్లేలా పక్కా సీసీ రోడ్లు నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే క్రౌడ్ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టకుని ఇన్ రోడ్.. ఔట్ రోడ్డు లెక్కన రెండు విశాలమైన సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు కలుగకుండా ఈ ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటలకులకు హాస్పిటాలిటీ సదుపాయం, ఇతర సదుపాయాలతోపాటు మూడు నెలల వ్యవధిలో నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు..గతేడాది జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ ఏడాది కూడా అంతకంటే భారీ స్థాయిలో సంక్రాంతి పండుగకు ముందే నిర్వహించాలని ఆలోచనలో ఉన్నామంటున్నారు. దీనికి తోడు పగటి పూట బోట్ షికార్, బీచ్ సాండ్ వెహికల్స్, స్కై డ్రైవింగ్, బెలూన్ డైవింగ్ ఇలా పలు అడ్వెంచర్ ఈవెంట్స్ నిర్వహించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి 3 రోజులు కూడా యానాం బీచ్‌లోనే భారీ ఎత్తులో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. దీనికోసం ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు దిశగా కృషిచేస్తున్నామన్నారు. భారీ భోగి మంటల నుంచి రంగవల్లుల అలంకరణ తదితర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింభించేలా పండుగ నిర్వహిస్తామని, ఈ ఏడాది బీచ్ ఫెస్టివల్ తరలి

వచ్చేందుకు వసతి, సదుపాయాల కల్పనకు ముందస్తుగానే ఆంధ్రాగోవా బీచ్ ఫెస్టివల్ అనే వెబ్ సైట్ ద్వారా స్లాట్లు తెరుస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవాలంటే 34 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అమలాపురం నుంచి బీచ్ వరకు పక్కా రోడ్లు సదుపాయాలున్నాయి. బస్సు సదుపాయం కూడా ఉంది. ఇక రాజమండ్రి నుంచి వచ్చేవారు రాజమండ్రి రైల్వే స్టేషన్ నుంచి అమలాపురం వచ్చి అమలాపురం నుంచి ఎస్.యానాం చేరుకోవచ్చు. కాకినాడ నుంచి అమలాపురం వచ్చి అక్కడి నుంచి ఎస్.యానాం బీచ్‌కు సునాయాసంగా చేరుకోవచ్చు.

# ఆస్ట్రేలియాపై ఎంపిక కాకున్నా 2027 వన్డే వరల్డ్ కప్‌లో అతడు ఉండాల్సిందే: రవిశాస్త్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్ కు టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు దక్కని సంగతి తెలిసిందే. మూడు వన్డేల సిరీస్ లో భాగంగా అక్టోబర్ 4న అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించింది. 15 మందితో కూడిన స్క్వాడ్ లో జడేజాను తప్పించడం ఆశ్చర్యానికి గురి చేసింది. మొదట జడేజాకు రెస్ట్ అనుకున్నప్పటికీ ఆ తర్వాత ఈ సీనియర్ ఆల్ రౌండర్ ని తప్పించామని అగార్కర్ చెప్పాడు. దీంతో జడేజా వన్డే ఫార్మాట్ ఆడడంపై అనుమానాలు నెలకొన్నాయి. 2027 వన్డే వరల్డ్ కప్ లోనూ జడేజా ఆడతాడా లేదా అనే డౌట్స్ కూడా ఉన్నాయి. 2027 వన్డే వరల్డ్ కప్ సమయానికి ఆల్ రౌండర్ జడేజా ఖచ్చితంగా భారత జట్టులో ఉండాలని టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తెలిపాడు. జడేజా జట్టులో ఎందుకు ఉండాలో కూడా వివరణ ఇచ్చాడు. రవిశాస్త్రి మాట్లాడుతూ.. "అందరూ 2027 వన్డే వరల్డ్ కప్ గురించి మాట్లాడుకుంటున్నారు. అతని వన్డే కెరీర్ ముగిసిందని ఎవరూ అనుకోవద్దు. 2027 వన్డే వరల్డ్ కప్ ప్రణాళికల్లో అతడు ఉంటాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. జడేజా ఫీల్డింగ్ చూస్తుంటే అతను 7-8 సంవత్సరాలు చిన్నగా ఉన్నాడేమో అనిపిస్తుంది. గ్రౌండ్ లో అతను బంతిని ఛేజ్ చేస్తూ ఆపడం చాలా గొప్పగా ఉంటుంది. ప్రస్తుతం భారత జట్టులో అక్షర్ పటేల్ ఉన్నాడు.

ఆస్ట్రేలియా లాంటి పర్యటనలో జడేజాకు ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదో నేను అర్థం చేసుకోగలను. ఆస్ట్రేలియాపై కేవలం మూడు వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. ఒక స్పిన్నర్ సరిపోతాడు. కానీ 2027 వన్డే వరల్డ్ కప్ సౌతాఫ్రికాలో జరుగుతుంది. అక్కడ వేరు వేరు వేదికలపై వేరు వేరు జట్లతో ఆడాల్సి ఉంటుంది. నాకు తెలిసి ఇద్దరు స్పిన్నర్లు జడేజా, అక్షర్ ఆడతారనుకుంటున్నా". అని శాస్త్రి తెలిపాడు. ఆస్ట్రేలియా గడ్డపైనా జడేజా లాంటి అనుభవజ్ఞుడి అవసరం ఎంతైనా ఉంది. జడేజాను కాదని సుందర్, అక్షర్ కు ఛాన్స్ దక్కింది. చూస్తుంటే జడేజాను సైలెంట్ గా పక్కకు తప్పించి యంగ్ ప్లేయర్స్ సుందర్, అక్షర్ లకు వరల్డ్ కప్ సమయానికి ఎక్కువ ఛాన్స్ లు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నుభవజ్ఞుడైన జడేజా 204 మ్యాచ్‌ల్లో 231 వికెట్లు పడగొట్టాడు. 2,806 పరుగులు చేసి బ్యాట్ తోనూ సత్తా చాటాడు. 2024 టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలిచిన తర్వాత జడేజా అంతర్జాతీయ టీ20 క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డే, టెస్ట్ క్రికెట్ లో కొనసాగుతున్నాడు. వన్డేల్లో ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలోనూ రాణించాడు. స్పిన్ ఆల్ రౌండర్ గా వన్డే జట్టులో రెగ్యులర్ ప్లేయర్ అనుకుంటే సెలక్టర్లు జడేజాకు ఊహించని షాక్ ఇచ్చారు.


# అది అత్యంత చెత్త నిర్ణయం.. రాహుల్‌ను నాలుగో స్థానంలో ఆడించండి: టీమిండియా మాజీ బ్యాటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఘోరంగా ఓడిపోయిన తర్వాత తీవ్ర విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. ఎంతో అనుభవం కలిగిన టీమిండియా బ్యాటింగ్ లైనప్ ఆసీస్ బౌలర్లకు తలవంచింది. కనీసం పోరాడకుండానే చేతులెత్తేసింది. ఈ మ్యాచ్ ఓటమి సంగతి పక్కన పెడితే ఒక విషయంలో తీవ్ర చర్చ జరుగుతుంది. అదేంటో కాదు టీమిండియా వికెట్ కీపర్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్. ఐదో స్థానంలో ఎంతో అద్భుతమైన రికార్డ్ ఉన్న రాహుల్ పెర్త్ వేదికగా ఆసీస్ తో జరిగిన తొలి వన్డేలో ఆరో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చాడు. ఎంతో అనుభవమున్న రాహుల్.. అక్షర్ పటేల్ కంటే వెనుక బ్యాటింగ్ కు రావడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ కు పంపడంపై టీమిండియా మాజీ బ్యాటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఫైరయ్యాడు. రాహుల్ ను నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు పంపాలని కోరాడు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. " మొదట వన్డేకు ముందు నేను రాహుల్ ను నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు పంపాలని కోరాను. రాహుల్ ను నాలుగోస్ తాణంలో ఆడించి శ్రేయాస్ అయ్యర్ ను ఐదో స్థానంలో పంపించండి. జట్టు కూర్పు నాకు భయంకరంగా అనిపించింది. అక్షర్ పటేల్‌ను రాహుల్ కంటే ముందుగా ఎందుకు పంపుతారు?. 2019 ప్రపంచ కప్‌లో, రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. నాలుగు, ఐదు స్థానాల్లో అతనికి అద్భుతమైన రికార్డ్ ఉంది. రాహుల్ కంటే ముందు అక్షర్ పటేల్‌ను ప్రమోట్ చేయడం చాలా దారుణం". అని శ్రీకాంత్ అన్నాడు. వన్డేల్లో రాహుల్ కు ఐదో స్థానంలో సూపర్ రికార్డ్ ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్ లో ఐదో స్థానంలో 50కి పైగా యావరేజ్ ఉంది. అయితే ఏడాది కాలంగా శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్ నుండి అతను ఒక స్థానం దిగజారి ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలో ఆరో స్థానంలో కూడా రాహుల్ అదరగొడుతున్నాడు. ఒత్తిడి సమయంలో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు విజయాలను అందిస్తున్నాడు. ఇటీవలే సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై అజేయంగా 42 పరుగులు చేసి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# వన్డే క్రికెట్ చరిత్రలో తొలిసారి.. బంగ్లాదేశ్‌పై వెస్టిండీస్ నయా వరల్డ్ రికార్డ్

**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డే క్రికెట్ లో వెస్టిండీస్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. ఫామ్ లో లేని వెస్టిండీస్ జట్టు వరల్డ్ రికార్డ్ అంటే ఆశ్చర్యపోవడం గ్యారంటీ. వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మంగళవారం (అక్టోబర్ 21) రెండో వన్డే ప్రారంభమైంది. ఢాకా వేదికగా షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో బంగ్లాదేశ్ మొదట బ్యాటింగ్ చేసింది. ఈ మ్యాచ్ లో ఆశ్చర్యకరంగా వెస్టిండీస్ స్పిన్నర్ తో వేయించింది. అయితే విశేషం ఏమిటంటే 50 ఓవర్లు వెస్టిండీస్ స్పిన్నర్ల చేత బౌలింగ్ వేయించడం షాకింగ్ గా మారింది. పిచ్ స్పిన్ కు అనుకూలించడంతో విండీస్ జట్టు ఏకంగా 50 ఓవర్లు స్పిన్ కే ఇవ్వడం విశేషం. వెస్టిండీస్ ప్లేయింగ్ 11లో ఒక్క స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్ కూడా లేకపోవకడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆల్ రౌండర్లు రూథర్ ఫోర్డ్, గ్రేవీస్ మీడియం పేస్ వేయగలిగిన వీరికి ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ ఇవ్వలేదు. పిచ్ మీద చాలా పగుళ్లు ఉండడంతో కెప్టెన్ షాయ్ హోప్ ఐదుగురు స్పిన్నర్లను ఉపయోగించాడు. అకేల్ హొసిన్, రోస్టన్ చేజ్,



| Bowler | O | M | R | W | NB | WD | ECO |
|---|---|---|---|---|---|---|---|
| Akeal Hosein | 10 | 1 | 41 | 2 | 1 | 2 | 4.10 |
| Roston Chase | 10 | 2 | 44 | 0 | 0 | 0 | 4.40 |
| Khary Pierre | 10 | 0 | 43 | 0 | 0 | 0 | 4.30 |
| Motie | 10 | 0 | 65 | 3 | 0 | 0 | 6.50 |
| Alick Athanaze | 10 | 3 | 14 | 2 | 1 | 0 | 1.40 |



అలిక్ అథనాజ్, గుడాకేష్ మోతీ, ఖారీ పియరీ తలో 10 ఓవర్లు వేసి తమ స్పెల్ పూర్తి చేశారు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలించడంతో విండీస్ మొత్తం 50 ఓవర్లను స్పిన్నర్లకే అప్పగించింది. పార్ట్ టైం స్పిన్నర్ అలిక్ అథనాజ్ కూడా 10 ఓవర్ల స్పెల్ వేశాడు.

వన్డే క్రికెట్ చరిత్రలో అసోసియేట్ జట్టు కాకుండా పూర్తి సభ్యత్వ జట్టుగా 50 ఓవర్లు స్పిన్ బౌలింగ్ వేసిన తొలి జట్టుగా విండీస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పింది. అంతకముందు ఈ రికార్డ్ శ్రీలంక పేరిట ఉంది. వన్డేల్లో శ్రీలంక మూడు వేరు వేరు మ్యాచ్ ల్లో 44 ఓవర్ల పాటు బౌలింగ్ చేయడం ఇప్పటివరకు అత్యధికం. 1996లో వెస్టిండీస్ పై.. 1998లో న్యూజిలాండ్ పై.. 2004 లో ఆస్ట్రేలియాపై జరిగిన వన్డే మ్యాచ్ లో శ్రీలంక 44 ఓవర్ల పాటు స్పిన్ బౌలింగ్ వేసింది. తాజాగా బంగ్లాదేశ్ పై వెస్టిండీస్ ఈ రికార్డ్ బ్రేక్ చేసింది. ఈ మ్యాచ్ లో బంగ్లాదేశ్ కూడా తమ తొలి 7 ఓవర్లు స్పిన్నర్లు వేయడం గమనార్హం. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. పిచ్ స్పిన్ కు అనుకూలించడంతో విండీస్

స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆతిథ్య బంగ్లా జట్టును కట్టడి చేశారు. 45 పరుగులు చేసిన సౌమ్య సర్కార్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ 32 పరుగులు చేసి రాణించగా.. చివర్లో రిషద్ హుస్సేన్ 14 బంతుల్లోనే 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 39 పరుగులు చేసి చివర్లో జట్టును 200 స్కోర్ దాటించాడు. వెస్టిండీస్ బౌలర్లలో గుడాకేష్ మోతీ మూడు వికెట్లు పడగొట్టాడు. అకేల్ హొసిన్, అలిక్ అథనాజ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. తొలి వన్డేలో బంగ్లాదేశ్ గెలిచి 1-0 ఆధిక్యంలో ఉంది.

## శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు



# అఖండ2.. బాలయ్య ఫ్యాన్స్ కు పూనకాలు ఖాయం!



సీనియర్ హీరో బాలకృష్ణ వరుస హిట్లతో ఫుల్ జోష్ మీదున్నారు. తన లక్కీ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో వస్తోన్న అఖండ2 సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారు బాలయ్య. 2021లో రిలీజైన అఖండ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఉత్సాహంగా వెయిట్ చేస్తున్నారు. అఖండ సినిమాతో బాలయ్య మాస్ ఇమేజ్ కు కొత్త డైమెన్షన్ ను ఇచ్చిన బోయపాటి అఖండ2ను మరింత ఆధ్యాత్మిక, యాక్షన్ ఫ్రేమ్ లో తెరకెక్కిస్తున్నారు.

**అఖండ2 కోసం ఎదురుచూపులు**

ఈ నేపథ్యంలో అఖండ2 గురించి ఇప్పటికే చాలా విషయాలు బయటికొచ్చి అవన్నీ ఫ్యాన్స్, సదరు మూవీ లవర్స్ ను ఎంతగానో ఎగ్జైట్ చేస్తుండగా ఈ సినిమా గురించి ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో వినిపిస్తోంది. అఖండతో పోలిస్తే అఖండ2 లో బోయపాటి యాక్షన్ సీక్వెన్స్ ను మరింత భారీగా ప్లాన్ చేశారని మొదటి నుంచి చెప్తూనే వస్తున్నారు.

**25 నిమిషాల యాక్షన్ సీక్వెన్స్**

అందులో భాగంగానే అఖండ2లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ 25 నిమిషాలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. అయితే అఖండ2లోని ఆ యాక్షన్ సీక్వెన్స్ ను చూసిన తర్వాత ప్ర ముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఆ యాక్షన్ ఎపిసోడ్ ను 20 నిమిషాల్లోపు ఉండేలా తగ్గించమని రిక్వెస్ట్ చేశారని సమాచారం. ఈ వార్తల్లో నిజమెంతన్నది పక్కన పెడితే ఒకవేళ నిజమైతే మాత్రం బాలయ్య ఫ్యాన్స్ కు పూనకాలు రావడం ఖాయమనే చెప్పాలి.

**నార్త్ మార్కెట్ ను టార్గెట్ చేసిన అఖండ2**

మామూలుగానే బాలయ్య-బోయపాటి సినిమాల్లో ఎక్కువ యాక్షన్ ఉంటుంది. ఇప్పుడు అఖండ2లో బోయపాటి కావాలని నార్త్ ఆడియన్స్ కోసం ఆ యాక్షన్ సీక్వెన్స్ ను మరింత పెంచినట్టు చెప్తున్నారు కాబట్టి, ఇక ఇది ఏ రేంజ్ లో ఉంటుందో ఊహించుకోవడం కూడా కష్టమే. అఖండ2లో బాలయ్య యాక్షన్, పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవెల్ ఉండటం ఖాయమని అర్థమవుతుంది. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ గా నటిస్తుండగా, 14 రీల్స్ ప్లస్ బ్యానర్ లో రామ్ ఆచంట, గోపీ ఆచంట అఖండ2 ను భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న అఖండ2 ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ సారి మేకర్స్ నార్త్ మార్కెట్ పై ఎక్కువ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

## కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com